
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

భద్రాద్రి కొత్తగూడెం

BHADRADRI KOTHAGUDEM

గురువారం, 4 జూలై 2024







పెనుబల్లి మండలం గొల్లగూడెంలో మొక్కలు నాటుతున్న మంత్రులు సురేఖ, పొంగులేటి



సత్తుపల్లిలోని జేవీఆర్ కళాశాలలో వనమహోత్సవం కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

పచ్చదనంతోనే ప్రశాంతత

- సమాజం ఆరోగ్యం కోసం మొక్కలు నాటాలి
- ప్రతీ ఒక్కరు కనీసం 10 మొక్కలు నాటి సంరక్షించాలి
- మంత్రులు పొంగులేటి, కొండా సురేఖ
- సత్తుపల్లిలో ఘనంగా వన మహోత్సవం
- లంకపల్లి రిజర్వు ఫారెస్టు గొల్లగూడెంలో మొక్కలు నాటిన మంత్రులు

వివరాలు : 4లో

నేటినుంచి 'ఇంజనీరింగ్' కౌన్సెలింగ్



ఖమ్మం ఖానాపురం హవేలి, జూలై 3: ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించే కౌన్సెలింగ్ గురువారం నుంచి మొదలు కానుంది. గురువారం స్లాట్‌బుకింగ్ ప్రారంభమై ఈనెల 12 వరకు అందుబాటులో ఉంటుందని ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ జాకీరుల్లా తెలిపారు. ఈనెల 6నుంచి 13వతేదీ వరకు సర్టిఫికెట్ల పరిశీలన ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాలలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు టీజీ ఎప్‌సెట్ హాల్ టికెట్, ర్యాంక్‌కార్డు, ఆధార్ కార్డు, ఎస్ఎస్‌సీ, ఇంటర్ మార్కుల మెమోలు, 6నుంచి ఇంటర్ వరకు స్టడీసర్టిఫికెట్లు, జనవరి 1 తర్వాత తీసుకున్న ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఈడబ్ల్యూఎస్‌కు అర్హులైన వారు నూతనంగా తీసుకున్న సర్టిఫికెట్లు స్లాట్ బుకింగ్ ధ్రువీకరణ పత్రంతో హాజరుకావాలని కౌన్సెలింగ్ కో ఆర్డినేటర్ ఎం.సుబ్రహ్మణ్యం తెలిపారు.

తరగతి గదిలో సెల్‌ఫోన్ బంద్



ఖమ్మం ఖానాపురం హవేలి, జూలై 3: ప్రభుత్వ పాఠశాలల్లో పాఠాలు బోధించే సమయాలలో ఉపాధ్యాయులు సెల్‌ఫోన్ వినియోగించకూడదని ఖమ్మం జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మ సూచించారు. నగరంలోని రిక్కాబజార్ పాఠశాలలో బుధవారం ప్రధానోపాధ్యాయుల సమావేశంలో డీఈవో మాట్లాడుతూ పాఠశాలలల్లో వర్క్ అడ్జస్ట్‌మెంట్, నిర్వహణ, అదనపు సబ్జెక్టు టీచర్లు ఉంటే ఉపాధ్యాయులను విద్యార్థులు ఎక్కువగా ఉన్న పాఠశాలలకు సర్దుబాటు చేయాలన్నారు. ఉపాధ్యాయులు ఎవరైనా తరగతి గదుల్లో సెల్‌ఫోన్ వాడితే శాఖాపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు నూరుశాతం ఉండే విధంగా కృషి చేయాలన్నారు. ప్రతి పాఠశాలలో నాలుగు సార్లు స్కూల్ కాంప్లెక్స్ మీటింగ్ నిర్వహించాలని, శుక్రవారం కలెక్టర్ అధ్యక్షతన హెచ్ఎంల సమావేశం నిర్వహించడం జరుగుతుందని, ఈ సమావేశానికి అందరు హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో కె.రవికుమార్, ఎంఈవోలు, హెచ్ఎంలు పాల్గొన్నారు.

ఆ ఐదు పంచాయతీలను కలపండి

సీఎం, డిప్యూటీ సీఎంలకు పొదెం వీరయ్య వినతి

భద్రాచలం, జూలై 3: ఆంధ్రాలో కలిసిన ఐదు పంచాయతీలను తిరిగి భద్రాచలంలో కలపాలని కోరుతూ డీసీసీ అధ్యక్షులు పొదెం వీరయ్య బుధవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు వినతిపత్రం అందజేశారు. త్వరలో జరగబోయే సీఎంల భేటీలో ఐదు పంచాయతీలను తిరిగి భద్రాచలంలో కలపడం ద్వారా పుణ్యక్షేత్రమైన భద్రాచలంలో భూ సంబంధిత సమస్యలు పరిష్కారమవుతాయని పేర్కొన్నారు. దీంతో సానుకూలంగా స్పందించిన వారు ఈ విషయమై చర్చిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

సీఎంలు దృష్టిసారించాలి..


ఐదు పంచాయతీల సమస్యను పరిష్కరించేందుకు రెండు రాష్ట్రాల సీఎంలు దృష్టిసారించాలని మాజీ ఎమ్మెల్సీ బీజేపీ నాయకుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. భద్రాచలం మండలంలోని ఐదు పంచాయతీలతో పోలవరం ముంపునకు సంబంధం లేకున్నా ఏపీలో కలిపి ఆ ప్రాంత వాసులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, తక్షణమే ఈ సమస్యకు పరిష్కారమార్గం చూపాలని కోరారు.

నలుగురు ఖైదీల విడుదల



ఖమ్మం క్రైం, జూలై 3: సత్‌ప్రవర్తనతో మెలిగే ఖైదీలకు క్షమాభిక్ష ప్రసాదించి విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఆదేశాలు జారీచేసింది. దీనిలో భాగంగా ఖమ్మం జిల్లా జైలులో శిక్ష అనుభవిస్తున్న నలుగురు ఖైదీలను బుధవారం విడుదల చేసినట్లు జైలు సూపరింటెండెంట్ శ్రీధర్ తెలిపారు. యలమందల పర్వతాలు, దాసరి వీరయ్య, బొల్లిపోగు జయరాజు, కుర్ర ఉదయ్‌చందర్ అనే ఖైదీలు పలు కేసుల్లో అరెస్టై కొంతకాలంగా యావజ్జీవ శిక్ష అనుభవిస్తున్నారు. కాగా, విడుదలైన వారు.. సమాజంలో ఉపాధి పొందేలా పలు వృత్తి విద్య, నైపుణ్యాలలో జైల్లోనే శిక్షణ అందించామని తెలిపారు. విడుదలైన నలుగురు తిరిగి నేరాలకు పాల్పడితే క్షమాభిక్ష రద్దవుతుందని ప్రభుత్వం అందించిన ఈ అవకాశాన్ని వారు సద్వినియోగం చేసుకోవాలని సూపరింటెండెంట్ సూచించారు.

నేడు విద్యాసంస్థల బంద్



ఖమ్మం సంక్షేమ విభాగం, జూలై 3: నీట్ నిర్వాహణలో కేంద్ర పరీక్షల నిర్వహణ సంస్థ (ఎన్‌టీఏ) విఫలమైందని ఈ నేపథ్యంలో గురువారం దేశవ్యాప్తంగా భారత్‌బంద్‌తో విద్యాసంస్థలు బంద్ చేసి బీజేపీ ప్రభుత్వానికి గుణపాఠం చెపుతామని ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి సభ్యుడు ఇటికాల రామకృష్ణ, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణ పేర్కొన్నారు. బుధవారం గిరిప్రసాద్ భవన్‌లో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, పీడీఎస్‌యూ, పీవైఎల్, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యూఐ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే అన్ని స్కాంలతో పాటుగా 24లక్షల వైద్య విద్యార్థుల భవిష్యత్‌కు సంబంధించిన నీట్ పరీక్షల స్కాం జరిగిందని ఆరోపించారు. ఈ బంద్‌లో విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యాసంస్థల యాజమాన్యాలు స్వచ్ఛందంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆయా సంఘాల నాయకులు సాయి, ఆసిఫ్, వెంకటేశ్, మస్తాన్, షేక్ బషీరుద్దీన్, మంద సురేశ్, రమేశ్, లక్ష్మణ్, చింతల రమేశ్, మద్దోజు శ్రావణ్, ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.



'విశ్వ' స్వప్నం నెరవేరేనా!?

దశాబ్దాలు గడుస్తున్నా యూనివర్సిటీ ఏర్పాటుకు నోచుకోని ఖమ్మం

- ఆదిలాబాద్, ఖమ్మం మినహా పూర్వ 8 ఉమ్మడి జిల్లాల్లో యూనివర్సిటీలు
- ఉన్నత విద్యకు దూరమవుతున్న విద్యార్థులు
- యూనివర్సిటీకి కావాల్సిన అన్ని హంగులు అందుబాటులో...
- విద్యారంగం అభివృద్ధికి ఎన్నో అవకాశాలు
- ముగ్గురు అమాత్యులు తలుచుకుంటే యూనివర్సిటీ ఏర్పాటు ఎంతో ఈజీ

రెండు రాష్ట్రాలకు గుమ్మంగా... విద్యాకేంద్రంగా.. అభివృద్ధి చెందుతున్న ఖమ్మంలో యూనివర్శిటీ (విశ్వ విద్యాలయం) ఏర్పాటు ప్రక్రియ ఈ సారైనా మొదలవుతుందా..? అని జిల్లా వాసులు ఎదురుచూస్తున్నారు. ఖమ్మంలో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని దశాబ్దంన్నర కాలంగా విద్యార్థులు, విద్యార్థి సంఘాలు కోరుతూ వస్తున్నాయి. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఉమ్మడి రాష్ట్రంలో పది జిల్లాల్లో యూనివర్సిటీలు ఏర్పాటుకాగా, ఉమ్మడి ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాలో మాత్రం ఏర్పాటు చేయలేదు. కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వంలో ఖమ్మానికి యూనివర్సిటీ మంజూరు చేస్తే ప్రస్తుతం ఖమ్మంలోని పీజీ కళాశాల ప్రదేశంలోనే యూనివర్సిటీ ఏర్పాటుచేయాలని జీవో కూడా మంజూరు చేశారు. ఆదిలాబాద్ జిల్లా నిర్మల్‌లో యూనివర్సిటీ ఏర్పాటుకు కిరణ్‌కుమార్ రెడ్డి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. తర్వాత రాష్ట్ర విభజన జరగగా, పదేళ్లుగా యూనివర్సిటీ ఏర్పాటు మరుగున పడింది.

ఖమ్మం, జూలై 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి ఖమ్మం జిల్లాలో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని, విద్యార్థులు, విద్యార్థి సంఘాలు కోరుతూ వస్తున్నాయి. ప్రస్తుతం వరంగల్ కేంద్రంగా కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి ఖమ్మం జిల్లా విద్యావిధానం నడుస్తోంది. డిగ్రీ, పీజీ, ఎంసీఏ, లా, ఎంబీఏతోపాటు పలు ఉన్నత విద్యాసంస్థలు ప్రభుత్వ, ప్రైవేటు రంగంలోనూ కాకతీయ యూనివర్సిటీకి అనుబంధంగా ఉంటున్నాయి. వరంగల్‌కు ఎక్కువమంది విద్యార్థులు వెళ్లలేక పీజీతో పాటు అక్కడ యూనివర్సిటీలో ఇతర ఉన్నత చదువులకు వెళ్లలేకపోతున్నారు. కౌన్సెలింగ్‌లో సీట్లు వచ్చినా హైదరాబాద్ తదితర ప్రాంతాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. జిల్లాలోనే యూనివర్సిటీ ఏర్పాటు చేస్తే దానికి అనుబంధంగా పలురకాల విద్యా కోర్సులు, పరిశోధనలు జరిగే అవకాశం ఉంది. కరస్పాండెంట్ కోర్సులు కూడా వస్తాయి.

వాస్తవానికి ఆంధ్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు సరిహద్దున ఖమ్మం ఉంది. సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాలకు ఖమ్మం విద్యాకేంద్రం. బస్సులు, రైలు ద్వారా ఖమ్మం వచ్చి చదువుకునే వీలుంది. ఖమ్మంలో యూనివర్సిటీ ఏర్పాటు చేస్తే విద్యారంగంలో ఖమ్మం ఎడ్యుకేషన్ హబ్‌గా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. ఇప్పటికే మెడికల్, ఇంజనీరింగ్‌తోపాటు ప్రభుత్వ, ప్రైవేటు రంగంలో పీజీ, డిగ్రీ పలురకాల విద్యాసంస్థలున్నాయి. యూనివర్సిటీ ఏర్పాటుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి కూడా ప్రత్యేక గ్రాంట్లు వచ్చే అవకాశం ఉంది. పేద, మధ్య తరగతి విద్యార్థులకు సైతం ఉన్నత విద్యను స్థానికంగా అభ్యసించే అవకాశం లభిస్తుంది.

పాలేరు నియోజకవర్గంలోని ఖమ్మంరూరల్ మండలం మద్దులపల్లిలో జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల గత ప్రభుత్వంలో ఏర్పాటైంది. ప్రభుత్వం పూర్తిస్థాయి భవనాలు, నిధులు కేటాయిస్తే రాష్ట్రంలో రెండో జేఎన్‌టీయూ యూనివర్సిటీగా అభివృద్ధి అయ్యే అవకాశం ఉంది. ఆంధ్రాలో జేఎన్‌టీయూ కాకినాడ, అనంతపురం రెండుచోట్ల యూనివర్సిటీలు నిర్వహిస్తున్నది. తెలంగాణలో జేఎన్‌టీయూ హైదరాబాద్ మినహా పలు జిల్లాల్లో కాలేజీలు మాత్రమే ఉన్నాయి. జేఎన్‌టీయూకి రెండో యూనివర్సిటీ ఏర్పాటు కాలేదు. పాలేరు జేఎన్‌టీయూ కాలేజీని, యూనివర్సిటీ స్థాయికి తీర్చిదిద్దే అవకాశం ఉంది. ఇందుకు భూములు నిధులు, ప్రణాళిక అవసరం. అలా కాని పక్షంలో ఖమ్మంలో ప్రత్యేకంగా యూనివర్శిటీ ఏర్పాటు డిమాండ్ ఉంది. జేఎన్‌టీయూ వస్తే సాంకేతిక పరమైన విద్యాకోర్సులు అందుబాటులోకి వచ్చే అవకాశం కలుగుతుంది. గత ప్రభుత్వంలో ఖమ్మంలో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని ప్రయత్నాలు జరిగినా సాధ్యం కాలేదు. జిల్లాలో ఉపముఖ్యమంత్రితోపాటు ఇద్దరు మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఖమ్మాన్ని విద్యాపరంగా అభివృద్ధి చేసేందుకు యూనివర్శిటీ ఏర్పాటుకు ప్రయత్నిస్తే సాధ్యమయ్యే అవకాశం ఉంది.



వడివడిగా 'సీతారామ' లింక్ కెనాల్

- పనులు త్వరితగతిన పూర్తవ్వాలి..
- అధికారులతో మంత్రి తుమ్మల నాగేశ్వర రావు
- జీఐటీఎల్ గ్యాస్ పైప్‌లైన్ క్రాసింగ్ పనులు పూర్తయ్యేలా చర్యలు
- వచ్చే నెలలో సీఎం చేతులమీదుగా ప్రారంభించేందుకు ప్లాన్

ఖమ్మం, జూలై 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్న వైరా లింక్ కెనాల్ పనులను వేగవంతం చేసేందుకు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం చీఫ్ సెక్రటరీ శాంతికుమారితో కీలక సంప్రదింపులు జరిపారు. గ్యాస్‌పైపులైన్ క్రాసింగ్, చైనా సాంకేతిక నిపుణుల వీసా తదితర అంశాలపై అధికారులతో తుమ్మల చర్చించారు. ఈ సందర్భంగా గుజరాత్ చీఫ్ సెక్రటరీతో ఫోన్‌లో సీఎస్ శాంతికుమారి మాట్లాడి గ్యాస్ పైప్‌లైన్ క్రాసింగ్ అనుమతి కోసం తాడేపల్లిగూడెంలో గల పైప్‌లైన్ జీఎంకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. అలాగే ఏపీ సీఎస్‌కు పైప్‌లైన్ క్రాసింగ్ పనుల సమస్యలను ఫోన్‌లో వివరించారు. సీతారామ ప్రాజెక్టులో 3 పంపుహౌస్‌లు పూర్తయ్యాయని, అందులో బీజీ కొత్తూరు వద్ద గల మొదటి పంపుహౌస్ మోటార్ ట్రయల్ రన్ ఈ నెల 27న నిర్వహించినట్టు తెలిపారు. వీకే రామవరం వద్ద గల 2వ పంపుహౌస్‌లోని పంపును జూలై 15న, కమలాపురం వద్ద గల 3వ పంపుహౌస్‌లోని పంపులను జూలై 20న ట్రయల్ రన్ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఈ సందర్భంగా తుమ్మల తెలిపారు. సీతారామ ప్రాజెక్టు మెయిన్ కాలువ పనులు జూలై 30 వరకు పూర్తి చేసి ఏన్కూర్ కెనాల్ (18ఎల్) ద్వారా సాగు నీరు సరఫరా చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన పనులు జరుగుతున్నాయని, ఏన్కూర్ కెనాల్ (18ఎల్ డిస్ట్రిబ్యూటరీ) మొత్తం 8.6కి.మీ. పొడవు ఉందని, ఇది సీతారామ ప్రాజెక్టు మెయిన్ కెనాల్ కి.మీ.100.225 వద్ద ప్రారంభమై నాగార్జున సాగర్ ఎడమ కాలువ (21ఎంబీసీ) కి.మీ. 52.299 వద్ద కలుస్తుందని తెలిపారు. దీనిలో 16-సీ.ఎం., సీ.డీ. కట్టడాలు ఉన్నాయని, అందులో 7 కట్టడాలు పూర్తి కావస్తున్నాయని, మిగిలిన కట్టడాలను జూలై నెల చివరి వరకు పూర్తిచేసేలా పనులు జరుగుతున్నాయని వివరించారు. 18 ఎల్ డిస్ట్రిబ్యూటరీ కెనాల్ కి.మీ.5.300 వద్ద జీఐటీఎల్ గ్యాస్ పైపులైను కాలువను దాటుతోందని, అందువల్ల పైపులైను క్రాసింగ్ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ, ఏపీ, గుజరాత్ ప్రభుత్వ ముఖ్యకార్యదర్శులను మంత్రి తుమ్మల కోరారు. లిఫ్ట్ మోటార్ల సాంకేతిక నిపుణులు చైనా దేశం నుంచి రావాల్సి ఉండగా వీసా సమస్యలపై ఇరిగేషన్‌శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఇరిగేషన్ సెక్రటరీ రాహుల్ బొజ్జాకు వివరించగా.. వెంటనే విదేశీ వ్యవహారాల శాఖ ప్రతినిధులతో మంత్రి ఉత్తమ్ మాట్లాడారని మంత్రి తుమ్మల తెలిపారు. ఆగస్టు నాటికి వైరా లింక్ కెనాల్ పనులు పూర్తి చేసి సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా లింక్ కెనాల్ ప్రారంభోత్సవం చేస్తామని మంత్రి తుమ్మల తెలిపారు.

కాగా, నీటిపారుదల శాఖ సలహాదారుగా ఉన్న కె.పెంటారెడ్డి పదవీ కాలం పొడిగించాలని, లిఫ్ట్ ఇరిగేషన్‌లో నిష్ణాతుడైన పెంటారెడ్డి సేవలు వినియోగించుకోవాలని, పంప్‌హౌస్ పనులు కుంటుపడకుండా ఆయన పదవీకాలం పొడిగించాలని ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కార్యదర్శి రాహుల్‌బొజ్జాకు మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేయగా, తక్షణమే పెంటారెడ్డి పదవీకాలం పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

రాష్ట్రానికి మంత్రి అయినా.. తీరిక దొరికితే చాలు.. ఆయన రైతుగా మారిపోతారు. పొలం గట్ల వెంట నడుస్తూ పంటలను పరిశీలిస్తారు.. సాగు యాజమాన్య పద్ధతులపై సూచనలు, సలహాలు ఇస్తుంటారు. ఆయన ఎవరో కాదు.. రాష్ట్ర రెవిన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి. కల్లూరు మండలంలోని తన స్వగ్రామమైన నారాయణపురంలో బుధవారం ఉదయం 6 గంటల సమయంలో ఆయన తన వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. దుక్కులు ఎలా దున్నారు..? వరినారు ఎలా పోశారు..? నారు ఎలా ఎదిగింది..? అనే విషయాలను స్వయంగా పరిశీలించారు. స్వతహాగా రైతు బిడ్డ అయిన పొంగులేటి.. తీరిక దొరి కినప్పుడల్లా తమ వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శి స్తుంటారు. ఎన్ని పనులున్నా గట్ల వెంట నడుస్తూ పొలాలను పరిశీలిస్తే మనస్సుకు ప్రశాంతతే కాదు, తృప్తి కలుగుతుందని ఆయన చెబుతుంటారు.

\- కల్లూరు



రాష్ట్రానికి మంత్రిగా..

తీరిక వేళలో రైతుగా...



ఖమ్మంలో రిలే నిరాహార దీక్షలో న్యాయవాదులు

కొత్త నల్ల చట్టాలను రద్దు చేయాలి..

- బార్ అసోసియేషన్ నేతల డిమాండ్
- కోర్టు ఆవరణలో రిలే నిరహార దీక్షలు

ఖమ్మం లీగల్, జూలై 3: కొత్తగా అమల్లోకి వచ్చిన నల్ల చట్టాలను రద్దు చేయాలని పలు న్యాయవాద సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. న్యాయవాదులు జిల్లా కోర్టు ప్రాంగణంలో బుధవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రిలే నిరహారదీక్షలు చేపట్టారు. నూతన చట్టాలు ప్రజలు, న్యాయవాదులకు వ్యతిరేకంగా ఉన్నాయని, ఈ చట్టాలను రద్దుచేయాలని బార్ కౌన్సిల్ సభ్యుడు కొల్లి సత్యనారాయణ కోరారు. దీక్షల్లో సత్యనారాయణతో పాటు చింతనిప్పు వెంకట్, పి.అమర్‌చంద్, గొల్లపూడి రామారావు, పొట్లపల్లి విప్లవ్‌కుమార్, పిడతల రామూర్తి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ లతీఫ్, ఓరుగంటి శేషగిరిరావు, ఏడునూతల శ్రీనివాసరావు, మందడపు శ్రీనివాసరావు, నేరెళ్ళ శ్రీనివాసరావు, మేకల సుగణారావు, ఆర్.పావెల్, ఆకుల శేఖర్‌బాబు, కొత్త వెంకటేశ్వరరావు, కె.పి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి ప్రాణం తీసిన పెన్ను

- ఆడుకుంటుండగా తలలో గుచ్చుకున్న వైనం
- రెండు రోజుల క్రితం ఘటన
- చికిత్స పొందుతూ మృతి
- భద్రాచలంలో విషాదం



భద్రాచలం, జూలై 3:మంచంపై కూర్చొని సరదాగా పెన్నుతో ఆడుతున్న చిన్నారి ప్రమాదవశాత్తు మంచంపై నుంచి పడడంతో పెన్ను తలలో గుచ్చుకొని మృతిచెందింది. భద్రాచలంలోని సుభాష్‌నగర్‌కాలనీకి చెందిన చిన్నారి రియాన్షిక (4) ప్రమాదవశాత్తు తలలో పెన్ను గుచ్చుకోవడంతో మృతి చెందింది. భద్రాద్రి జిల్లా భద్రాచలంలో బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్న దొమ్మేటి మణికంఠ, స్వరూప దంపతుల ఏకైక కుమార్తె రియాన్షిక రెండు రోజుల క్రితం ఇంట్లో మంచంపై కూర్చొని పెన్నుతో పుస్తకంలో గీతలు గీస్తూ ఆడుకుంటూ మంచంపై నుంచి కిందకు దిగుతుండగా ప్రమాదవశాత్తు జారిపడింది. ఈ క్రమంలో చిన్నారి చేతిలో ఉన్న పెన్ను ఆమె తలలో చెవి పైభాగంలో బలంగా గుచ్చుకుంది. దీంతో కుటుంబ సభ్యులు చిన్నారిని భద్రాచలంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించగా ప్రాథమిక చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. అక్కడ ఓ ప్రైవేటు ఆసుపత్రిలో మంగళవారం వైద్యులు ఆపరేషన్ చేసి చిన్నారి రియాన్షిక తలలో గుచ్చుకున్న పెన్నును తొలగించారు. ఈ క్రమంలో బుధవారం తెల్లవారుజాము వరకు బాగానే ఉన్న చిన్నారి ఆరోగ్యం ఒక్కసారిగా విషమించి మృతి చెందింది. చిన్నారి మృతదేహానికి బుధవారం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు. ఒక్కగానొక్క కుమార్తె మృతిచెందడంతో తల్లిదండ్రుల బాధ వర్ణనాతీతం. ఈ ఘటన భద్రాచలంలో విషాదాన్ని నింపింది.

కళతప్పిన ఎర్ర పూలవనం

సాయుధ పోరాటంతోనే వ్యవస్థను మార్చగలమని నమ్మి ఏర్పడిన సీపీఐ(ఎంఎల్) పార్టీ ఆచరణలో చీలికలు పేలికలుగా మారుతోంది. నేతల నిర్వాకంతో సంభవిస్తున్న చీలికలతో.. విప్లవ పార్టీలు తమ మనుగడకే ప్రమాదం తెచ్చుకుంటున్నాయి. వరుస పరిణామాలతో ఉద్యమాలకు తమ నెత్తుటి తిలకం దిద్ది అమరులైన అన్నల స్మారక స్థూపాలు చిన్నబోతున్నాయి. భూమి, భుక్తి, విముక్తి పోరాటలే లక్ష్యంగా సాయుధ పోరాటమే సరైన మార్గంగా 1976లో అవిర్భవించిన సీపీఐ (ఎంఎల్) ఐదు దశాబ్దాల ఉద్యమగమనంలో అనేకానేక కారణాలతో గ్రూపులుగా చీలింది. 1978లో ప్రతిఘటనపోరాటాలతో పాటు ఉద్యమ విస్తరణకు పార్లమెంటరీ పంథాతో, అజ్ఞాత సాయుధ దళాలతో జోడు సవారిచేసిన ఎంఎల్ పార్టీ ఆచరణలో ముక్కలు చెక్కలుగా మారి నేడు వ్యక్తుల పేరిట మనుగడతో మినుకుమినుకు మంటున్నాయి.

- నాలుగు ముక్కలైన న్యూడెమోక్రసీ
- చీలికలు,పేలికలుగా నక్సలైట్ ఉద్యమం
- ఏజెన్సీలో అమరుల స్థూపాలు వెలవెల

ఇల్లెందు, జూన్ 29: 1976లో సాయుధ పోరాట పంథాతో ఆవిర్భవించిన ఎంఎల్ పార్టీ గడిచిన ఐదు దశాబ్దాల కాలంలో అనేక గ్రూపులుగా చీలిపోయింది. సాయుధ పోరాటం గెరిల్లా సైన్యాల నిర్మాణాలకు పరిమితం అయిన పిపుల్స్‌వార్(మావోయిస్టు) ఒడిదొడుకుల మధ్య సాయుధపంథాలో సాగుతుండగా, పార్లమెంటరీ పంథా కుడా అనుసరించిన సత్యానారాయణ సింగ్, చంద్ర పుల్లరెడ్డి నాయకత్వంలో ఏర్పడిన సీపీఐ (ఎంఎల్) మాత్రం అనేక గ్రూపులుగా చీలిపోయింది.

ఎన్నికలను సైతం ఉద్యమ విస్తరణకు వినియోగించుకోవాలన్న వ్యూహాన్ని అమలు చేసిన ఎంఎల్ పార్టీలో 1978లో ఇల్లెందు నియోజకవర్గంలో , ఆ పిదప సిరిసిల్ల నియోజకవర్గంలో జనశక్తి పార్టీ ఎమ్మెల్యే స్థానాలను గెలుచుకున్నాయి. ప్రత్యేకించి ప్రజాపంథాగా, న్యూడెమోక్రసీగా చీలినా ఆ పార్టీ ఆరు పర్యాయాలు ఇల్లెందు ఎమ్మెల్యే స్థానాలు కైవసం చేసుకుంది. పలు మండలాల్లో ఎంపీటీసీలను, జడ్పీటీసీలను, ఎంపీపీలను, పెద్ద సంఖ్యలో సర్పంచులను గెలుచుకోవడం ద్వారా ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో ప్రాబల్యం పెంచుకుంది. 1978లో ఏర్పడిన సీపీఐ(ఎంఎల్) గడిచిన ఐదు దశాబ్దాల కాలంలో విమోచన, ప్రజాపంథా, జనశక్తి, ప్రతిఘటన. ప్రజాప్రతిఘటన, న్యూడెమోక్రసీ, సీపీఎస్‌యూ, ఏఎల్‌టీ, మాస్‌లైన్ తదితర పేర్లతో చీలకలు ఏర్పడ్డాయి.


ఇల్లెందులో హత్యకు గురైన ఎంపీపీ బోర్ర వీరాస్వామి స్మారక స్థూపం

నాలుగు ముక్కలైన న్యూడెమోక్రసీ

ఇల్లెందు నియోజకవర్గంలో తిరుగులేని ఆధిపత్యం ప్రదర్శించిన న్యూడెమోక్రసీ దశాబ్ద కాలంలో నాలుగు ముక్కలుగా చీలింది. ఫలితంగా ఆరు పర్యాయాలు ఇల్లెందులో ఎమ్మెల్యే స్థానాన్ని గెలుచుకున్న ఆ గ్రూపులకు ఎన్నికల్లో డిపాజిట్లు కుడా దక్కని పరిణామాలు ఏర్పడ్డాయి. పటిష్ఠ క్యాడర్, సాయిధ దళాలు కలిగి మావోయిస్టు పార్టీకి దీటుగా ప్రజాబాహుళ్యంలో పట్టు సాదించిన న్యూడెమోక్రసీలో తలెత్తిన చీలికలు నక్సల్స్ ఉద్యమంపై తీవ్ర ప్రతికూలతకు కారణమైంది. న్యూడెమోక్రసీ నుంచి తొలుత పాతూరి ఆదినారాయణ స్వామి(పెద్ద చంద్రన్న వర్గం) చీలిపోగా ఆ తరువాత యతేంద్ర కుమార్ నాయకత్వంలోని న్యూడెమోక్రసీ నుంచి మరో చీలిక జరిగి పేరును మాస్‌లైన్‌గా మార్చుకున్నారు.

చంద్రన్న నాయకత్వంలోని న్యూడెమోక్రసీలోని తాజాగా మారో వర్గం సాదినేని వెంకటేశ్వరావు నాయకత్వంలో చీలికను చవిచూసింది. ఫలితంగా న్యూడెమోక్రసీ నాలుగు ముక్కలుగా చీలినట్లయింది. అయితే కొన్ని గ్రూపులు ఐక్యత పేరిట ఏకమవుతున్నట్లు ప్రకటిస్తున్నప్పటికి నేతల నడుమ తలెత్తుతున్న విభేదాలు ఐక్యతను ఎక్కువకాలం కొనసాగించలేకపోయాయి. రెండు ఐక్యతలు నాలుగు చీలికలుగా న్యూడెమోక్రసీ పార్టీల పరిస్థితి ఏర్పడింది.

చీలికలతో బిక్కుబిక్కు

విప్లవ పార్టీలో చీలికల తరుణంలో గతంలో ఏజెన్సీ గ్రామాల్లో పట్టు కోసం జరిగిన హత్యలు గుర్తుకు వచ్చి తాజా న్యూడెమోక్రసీ చీలిక నేపథ్యంలో విప్లవ శ్రేణులు హడలిపోతున్నాయి. ప్రత్యేకించి ఇల్లెందు నియోజకవర్గంలో గతంలో నక్సలైట్ల ఆధిపత్య పోరులో చెపూరి ధనుంజయ, గౌని వీరన్న, సింగు సత్యనారాయణ, తుడుం రామయ్య, హన్మంతరావు, బిక్కుమియా, గుగ్గుల్ల వెంకటేశ్వర్లు, ముక్తి బిక్షం, ఎర్రమల్ల ఏర్రయ్య, పాపన్న, వీరబ్రహ్మం, పులుసు వెంకన్న, పూల్య, బోర్ర వీరాస్వామి హత్యలకు గురయ్యారు. అదే క్రమంలో పోలీస్ ఎన్‌కౌంటర్లతోను అనేక మంది అసువులు బాసారు. కాచినపల్లి ఎన్‌కౌంటర్లలో దళకమండర్ కోటన్న, లీగల్ సంఘాల నాయకులు నంబూరి సీతరామయ్య, చింత లక్ష్మీ, నూసేన కుమారి, నోముల పరాశురాం, లడాయి గడ్డ ఎన్‌కౌంటర్లలో దళకమాండర్ చంద్ర కృష్ణమూర్తి (ఎల్లన్న), రాజాస్తాన్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆయుధాలకోసం వెళ్లిన పగడాల వెంకన్న కన్నుమూశారు. దళకమాండర్‌లు ప్రభాకర్, లింగన్న, మురళి, వేర్వేరు పోలీస్ ఎన్‌కౌంటర్‌లో ప్రాణాలు కొల్పోయారు.


కాచినపల్లి ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన ఐదుగురు అమరుల స్థూపం


విద్యార్థుల చదువు గురించి తెలుసుకుంటున్న పీవో

విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలి

- ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్


వంట సామగ్రిని పరిశీలిస్తున్న పీవో

ములకలపల్లి, జూలై 3: గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాల, వసతిగృహాల్లో చదువుతున్న విద్యార్థులకు మె ప్రకారం పౌష్టికరమైన ఆహారంతోపాటు విద్య, వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. బుధవారం ములకలపల్లి మండలంలోని గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని డార్మెటరీ, కిచెన్ షెడ్, కూరగాయలు పరిశీలించి పాఠశాల లోపల, బయట, పాఠశాల నిర్వహణ సరిగ్గా లేక అపరిశుభ్రంగా ఉండటంతో హెచ్‌ఎంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. విద్యార్థులకు వడ్డిస్తున్న ఆహారాన్ని అయన పరిశీలించి మెను ప్రకారం ప్రతిరోజు భోజనం పెడుతున్నది లేనిది విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థులకు ఇబ్బందులకు కలగకుండా మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్, బ్యూబ్ లైట్లు, ఫ్యాన్లు తప్పని సరిగా ఉండాలన్నారు. ఆశ్రమ పాఠశాలలో పని చేసే హెచ్‌ఎంలు, వార్డెన్లు, సబ్జెక్టు టీచర్లు పనిచేసే సిబ్బంది అందరు స్థానికంగా ఉండాలని, స్థానికత పాటించని సిబ్బంది పై కఠిన చర్యలు తప్పవని అన్నారు. విద్యార్థులకు హిందీ, ఇంగ్లీష్ నైపుణ్యత సరిగ్గా లేదని పిల్లలకు అర్థమయ్యే రీతిలో సబ్జెక్టు టీచర్లు విద్యా బోధన చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్వరరావు, వార్డెన్ వీరభద్రం పాల్గొన్నారు.

చెరుకు సాగులో యంత్ర సహాయం

- విత్తనం మొదలు నరకడం వరకు యంత్రాలతోనే
- 4 యంత్రాలు తెప్పిస్తున్న కాకతీయ షుగర్స్ ఫ్యాక్టరీ
- ఈ సీజన్ నుంచి ప్రయోగాత్మకంగా అమలు

కల్లూరు, జూలై 3: కల్లూరులోని కాకతీయ షుగర్స్ ఫ్యాక్టరీ పరిధిలో చెరుకు నరకడానికి కూలీల కోరతను అధిక మించేందుకు యంత్రీకరణ పద్ధతికి శ్రీకారం చుట్టనున్నారు. ఫ్యాక్టరీ యాజమాన్యం తమిళనాడు నుంచి నాలుగు యంత్రాలను తప్పించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ప్లాంట్ ఇంజనీర్ కోడాలి రఘునాథబాబు తెలిపారు.

యంత్రాలతో రైతుకు ఆదా..

గానుగకు సిద్ధంగా ఉన్న చెరుకును యంత్రాలతో నరికిస్తే సగటున రోజుకు 3 ఎకరాల చెరుకు తోటను నరకగా 120 టన్నుల చెరుకు సేకరించొచ్చు. దీంతో రైతుకు టన్నుకు ఖర్చు రూ.650 అవుతుంది. అదే కూలీలతో చేరుకు నరికితే ఒక టన్నుకు రూ.1200 అవుతుంది. ఒక యంత్రం సగటున 3 ఎకరాల చెరుకు తోటను నరికితే అందుకు గాను కూలీలు 120 మంది అవసరం ఉంటుంది. ఫ్యాక్టరి ఏరియాలో ఒకే రోజున నాలుగు యంత్రాలు పని చేయటంతో 500 మంది కూలీలతో సరిసమానంగా పనిచేస్తాయి. రోజులో 12 ఎకరాల చెరుకును నరుకుతాయి


చెరుకును నరుకుతున్న యంత్రం(ఫైల్)

చెరుకు సాగులో ఆధునిక యజమాన్య పద్ధతి

ఈ ఏడాది యంత్రాలతో చెరుకును నరికించే క్రమంలో ఫ్యాక్టరీ యాజమాన్యం విత్తన సాగు విధానంలో కూడ మార్పులు చేపట్టింది. చెరుకు విత్తన సాగులో సాలులో వరసకు నాలుగున్నర అడుగుల దూరంలో విత్తన సాగు చేపట్టే కార్యక్రమం అమలు పరుస్తూ రైతులను ప్రోత్సహిస్తున్నారు. ఈ విధానంలో రైతు చెరుకు సాగు చేస్తే ఫ్యాక్టరి యాజమాన్యం 2 టన్నుల విత్తనం ఉచితంగా అందిస్తూ ప్రయోగాత్మకంగా ఈ ఏడాది 200 ఎకరాల్లో చెరుకును సాగు చేపట్టారు. ఈ పద్ధతిలో 40 నుంచి 50 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. చెరుకును నరికేందుకు ఎకరానికి రూ.800 ఖూలీల ధర కూడ యాజమాన్యం నిర్ణయించింది.

ఉనికి కోసమే 'సీతారామ' నిందారోపణలు

- కేసీఆర్ వల్లే ఇల్లెందుకు నష్టం
- ఇల్లెందు శాసన సభ్యుడుకోరం కనకయ్య

ఇల్లెందు, జూలై 3: ప్రజలు తిరస్కరించిన మాజీ ఎమ్మెల్యేలు గుమ్మడి నర్సయ్య, బానోత్ హరిప్రియ అఖిలపక్షం పేరిట ఉనికి చాటుకునేందుకు సీతరామ ప్రాజెక్టు డిజైన్ మార్చినట్లు నిందారోపణలు చేస్తున్నరని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆరోపించారు. గతంలో కేసీఆర్‌తో సీతారామ ప్రాజెక్టు తాను శంకుస్థాపన చేయిస్తే తదుపరి ఎమ్మెల్యేగా ఉన్న హరిప్రియ ఎందుకు ప్రాజెక్టును ఇల్లెందు నియోజకవర్గానికి తీసుకురాలేదని నిలదీశారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే కనకయ్య మాట్లాడారు. కేసీఆర్ చేసిన మోసం మూలంగానే ప్రాజెక్టు జలాలు ఇల్లెందు నియోజకవర్గానికి రాలేదని, తాను ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి, ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి సీతారామ ప్రాజెక్టును ఇల్లెందుకు మళ్లించాలని కోరినట్లు తెలిపారు. గతంలో కేసీఆర్ మోసాన్ని గుమ్మడి నర్సయ్య ఎందుకు ప్రశ్నించలేదన్నారు. ఇల్లెందు నియోజకవర్గంలో ప్రతి ఎకరాకు సీతారామ జలాలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యేలు గుమ్మడి నర్సయ్య, హరిప్రియ, ఊకే అబ్బయ్య ఇల్లెందు నియోజకవర్గనికి ఎలాంటి అభివృద్ధి పథకాలు తీసుకురాలేదని ఆరోపించారు. తన హయంలోనే అభివృద్ధి జరిగిందని తెలిపారు. అర్థరహితమైన ఆరోపణలు చేస్తు కాంగ్రెస్ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలు మానుకోవాలని హితవుపలికారు. ఈసమావేశంలో మున్సిపల్ చైర్మన్ దమ్మలపాటి వెంకటేశ్వరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఐదు పంచాయతీలను భద్రాద్రిలో కలపండి

- సీఎం రేవంత్‌రెడ్డికి విలీన పంచాయతీల వాసులు వినతి
- రేపు సీఎంను కలవనున్న అఖిలపక్షం

భద్రాచలం, జూలై 3: రాష్ట్ర విభజన సమయంలో భద్రాచలం మండలం నుంచి ఏపీలో కలిపిన ఐదు పంచాయతీలను తిరిగి తెలంగాణలో విలీనం చేయాలని ఆ ఐదు పంచాయతీలకు చెందిన అఖిలపక్షం నాయకులు, ప్రజా ప్రతినిధులు తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి విన్నవించనున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసేందుకు ప్రస్తుతం ఏపీ పరిధిలో ఉన్న యటపాక, పురుషోత్తపట్నం, గుండాల, పిచుకల పాడు, కన్నాయిగూడెం పంచాయతీలకు చెందిన అఖిల పక్షం నాయకులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు నిర్ణయించారు. ముఖ్యమంత్రితో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన మంత్రులను, ఎమ్మెల్యేలను కలిసి తమ గోడు వెళ్లబుచ్చుకోనున్నారు. ఏపీలోని తమ జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే 800 కి.మీ. పైగా ప్రయాణం చేయాలని, కోర్టు వ్యవహారాల కోసం 200 కి.మీ. దూరంలో ఉన్న రాజమండ్రికి, ప్రభుత్వ వైద్యం కోసం 230కి.మీ. దూరంలో ఉన్న కాకినాడకు వెళ్లాల్సి వస్తోందని వాపోయారు. గత పదేళ్లుగా ఎన్నిసార్లు రెండు రాష్ట్ర ప్రభుత్వాలకు తమ మొర పెట్టుకునా తమ సమస్య పరిష్కారం కాలేదని, ఇప్పుడు రెండు రాష్ట్రాల సీఎంలు బేటీ కానున్న నేపథ్యంలో కీలకమైన ఈ అంశంపై తుది నిర్ణయం తీసుకొని తమకు న్యాయం చేయాలని విలీన పంచాయతీలకు చెందిన నాయకులు కోరుతున్నారు.

పచ్చదనంతోనే ప్రశాంతత

- సమాజం ఆరోగ్యం కోసం మొక్కలు నాటాలి
- ప్రతీ ఒక్కరు కనీసం 10 మొక్కలు నాటి సంరక్షించాలి
- మంత్రులు పొంగులేటి, కొండా సురేఖ
- సత్తుపల్లిలో ఘనంగా వనమహోత్సవం


ర్యాలీలో పాల్గొన్న మంత్రులు

సత్తుపల్లి, జూలై 3: సమాజం ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతిఒక్కరూ విరివిగా మొక్కలు పెంచాలని, ఇళ్లు, ఇతర అభివృద్ధి పనులకు చెట్లను నరికేయడం వలన కాలుష్యం పెరిగిపోతుందని, అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. బుధవారం సత్తుపల్లిలో జరిగిన వనమహోత్సవం అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ 1959లో అప్పటి కేంద్రమంత్రి కేఎం మున్షీ వనమహోత్సవానికి నాంది పలికారని, ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న వన మహోత్సవం వజ్రోత్సవ వన మహోత్సవమని అన్నారు. రాష్ట్రంలో 14వేల నర్సరీలలో 22కోట్ల మొక్కలను పెంచామని, ఈ ఏడాది 20కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ, ఆశా, అటవీ శాఖలు సమన్వయంతో గ్రామాలలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొని ప్రజలను ప్రోత్సహించాలని సూచించారు. అడవులలో ఫలాలు ఇచ్చే మొక్కలను నాటాలని, తద్వారా గిరిజనులకు లబ్ధితో పాటు కోతులు కూడా గ్రామాలలోకి రాకుండా ఉంటాయని సూచించారు.


మొక్కను నాటుతున్న మంత్రి సురేఖ

రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఒక్కో వ్యక్తి కనీసం 10మొక్కలు నాటి పదిమందిని ప్రోత్సహించాలని అన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించడం కూడా ప్రధాన బాధ్యతగా చూసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాలలో ముందుకు వెళుతుందని, కుల మతాల సమతుల్యత పాటిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నట్లు చెప్పారు.

ప్రజ, ప్రకృతి కవి జయరాజ్ మాట్లాడుతూ మానవ మనుగడకు ప్రకృతి అందించే వనరులు, కాలుష్య రహిత సమాజం కావాలంటే మొక్కలను నాటి సంరక్షించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, ఆషా సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ మట్టా దయానంద్ మాట్లాడుతూ సత్తుపల్లి సింగరేణి ప్రభావిత ప్రాంతం కావడంతో వాతావరణ కాలుష్యం పెరిగిందని అన్నారు. గ్లోబల్ వార్మింగ్ పెరిగితే వర్షాలు కురవవని, పంటలు పండక ఆహార కొరత ఏర్పడుతుందన్నారు. పర్యావరణ సమతుల్యత మొక్కలతోనే సాధ్యమని, ప్రతిఒక్కరూ వనమహోత్సవంలో పాల్గొని మొక్కలు నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు.

కాగా, వనమహోత్సవ కార్యక్రమంలో పాల్గోనేందుకు బుధవారం సత్తుపల్లి డిగ్రీ కళాశాలకు వచ్చిన మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలకు ముందుగా సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. పలు కళాశాల, పాఠశాలల విద్యార్థులు, ఎన్‌సీసీ కేడెట్లు జాతీయ పతకాలు చేతబూని స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గిరిజనులు సాంప్రదాయ కొమ్ము డ్యాన్స్ కళాకారులు ప్రదర్శించిన నృత్యం ఆకట్టుకుంది. అనంతరం పట్టణంలో జరిగిన వనమహోత్సవ ర్యాలీలో మంత్రులు, ఎమ్మెల్యే, అటవీ అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అటవీ, పర్యావరణ, సైన్స్ టెక్నాలజీ శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీ నదీమ్ అహ్మద్, పీసీసీఎఫ్ డీ.బీమా నాయక్, జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ్ విక్రం సింగ్, పోలీస్ కమీషనర్ సునీల్‌దత్, అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సన్యాసయ్య పాల్గొన్నారు.

చదువులు సాగేదెలా..?

- నిబంధనలకు వ్యతిరేకంగా టీచర్ల బదిలీ ప్రక్రియ?
- ఇష్టారీతిన రిలీవింగ్ ఆర్డర్లు

దుమ్ముగూడెం, జూలై 3: మండల విద్యాశాఖలో నిబంధనలకు వ్యతిరేకంగా ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియ జరగడంతో ఒక పాఠశాల పూర్తిగా మూతబడగా, మరి కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యా సామర్థ్యానికి వ్యతిరేకంగా టీచర్లు రిలీవ్ అయ్యారు. బదిలీ నిబంధనల ప్రకారం 1-19 వరకు విద్యార్థులున్న ప్రాథమిక పాఠశాలలో ఒక ఎస్జీటీ, 20-60 మంది విద్యార్థులున్న పాఠశాలలో ఇద్దరు, ఆపై ప్రతీ ముప్పై మందికి ఒక ఎస్జీటీ విధులు నిర్వర్తించాలి. కాగా దుమ్ముగూడెం మండలంలోని పలు పాఠశాలల్లో ఇవేమీ పరిగణలోనికి తీసుకోకుండా ఇష్టారీతిన టీచర్లను రిలీవ్ చేశారు. అయిన టీచర్లను రిలీవ్ చేసే సందర్భంలో తప్పనిసరిగా రేషనలైజేషన్ నిబంధన పాటించాలి. ఒక పాఠశాలలోని టీచర్లందరూ బదిలీ ఐతే వారిలో సీనియర్లను మాత్రమే రిలీవ్ చేయాలి. కె. వీరభద్రాపురం ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరు టీచర్లను ఒకేసారి రిలీవ్ చేయడంతో విద్యార్థుల చదువు అటకెక్కింది. కొన్ని పాఠశాలల్లో ఎస్జీటీలను పూర్తిగా రిలీవ్ చేయగా, అక్కడ కేవలం స్కూల్ అసిస్టెంట్లు మాత్రమే మిగలడం విశేషం.


ఉపాధ్యాయులు లేక ఆడుకుంటున్న కె.వీరభద్రాపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు

రెండు రోజులుగా మూతబడ్డ పాఠశాల

ముప్పై మంది విద్యార్థులున్న కెవీరభద్రాపురం ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరు టీచర్లను ఈనెల 30న రిలీవ్ చేశారు. దీంతో గత రెండు రోజులుగా విద్యార్థులు పాఠశాలకు వచ్చి ఖాళీగా కూర్చొని ఇంటికి తిరిగి వెళ్తున్నారు. మహదేవపురంలోనూ ముగ్గురు ఎస్జీటీలను రిలీవ్ చేసినట్లు తెలుస్తోంది. రేషనలైజేషన్ నిబంధన పాటించకుండా గుర్రాలబయలు, కొమ్మనాపల్లి, ములకపాడు, నరసాపురం ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులను రిలీవ్ చేసినట్లు సమాచారం. ఇతర మండలాల నుంచి దుమ్ముగూడెం మండలానికి బదిలీపై రావాల్సిన టీచర్లను అక్కడి ఎంఈఓలు రేషనలైజేషన్ నిబంధన పాటించి రిలీవ్ చేయకుండా ఆపడంతో దుమ్ముగూడెం మండలంలో భర్తీ కావాల్సిన పోస్టులు ఖాళీగా మిగిలాయి.

ఎంఈవో ఏమంటున్నారంటే..

కె వీరభద్రాపురం నుంచి అంజుబాకకు బదిలీ ఐన ఒక టీచర్‌ను బుధవారం మధ్యాహ్నం వెనక్కు పిలిపించామని ఎంఈవో సమ్మయ్య తెలిపారు. ఐతే కొంత ఆలస్యంగా మధ్యాహ్నం నుంచి విధులకు హాజరయ్యారని తెలిపారు. ఈనెల 2న టీచర్లు ఎవరూ లేక పాఠశాల పూర్తిగా మూతపడిన విషయమై వివరణ కోరగా తన దృష్టికి రాలేదన్నారు. చర్ల మండలం నుంచి బదిలీపై కెవీరభద్రాపురం పాఠశాలకు వచ్చిన ఇద్దరు టీచర్లు వెనక్కు వెళ్లడంతో సమస్య తలెత్తిందన్నారు. కెవీరభద్రాపురం నుంచి రిలీవ్ ఐన ఇద్దరు టీచర్లు ఇక్కడే కొనసాగుతారన్నారు. మహదేవపురం యూపీఎస్ నుంచి బదిలీ ఐన ముగ్గురు ఎస్జీటీల్లో ఒకరిని వెనక్కు పిలిపిస్తామన్నారు.

వలస ఆదివాసుల అరణ్యరోదన


గర్భిణిని ఆసుపత్రి తీసుకెళ్లడానికి జడ్డి కట్టి వాగు దాటుతున్న నీలాద్రిపేట ఆదివాసులు(ఫైల్)

- రహదారులకు నోచుకోని వైనం

కరకగూడెం, జూలై 2: మండలంలోని వలస ఆదివాసీలకు కనీస సౌకర్యాలు అందడం లేదు. అంగారుగూడెం, లిమ్మగూడెం, అశ్వాపురంపాడు, నీలాద్రిపేట, మాదన్నగూడెం గ్రామాలకు రహదారులు లేక వలస ఆదివాసీ ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. వర్షాలు కురిస్తే అంతే సంగతులు. ఈ గ్రామాలలో రాత్రి సమయంలో పాములు, తేళ్లు, ఇంకా క్రూర మృగాలతో ప్రమాదం జరిగితే ఈ గ్రామాలకు రహదారులు లేకా ప్రజలు జెడ్డి కట్టి మొసుకుని రావల్సిన దుస్థితి లేదంటే ప్రాణాలు కోల్పొయిన సంఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి తక్షణమే రహదారులు నిర్మించాలని మారుమూల గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


అశ్వాపురం గ్రామస్థులకు ఈ రహదారే దిక్కు


మట్టిదారిలోనే నీలాద్రిపేట ప్రజల నడక

'మాటిచ్చా.. సరస్వతి గుడిని నిర్మించా'

- 'ఆంధ్రజ్యోతి'తో సినీ గేయ రచయిత చంద్రబోస్
- ఆయన స్వగ్రామం చల్లగరిగలో 'ఆస్కార్ గ్రంథాలయం'



ఆస్కార్ గ్రంథాలయం

చిట్యాల, జూలై 3: ఆస్కార్ అవార్డు గ్రహీత, సినీ గేయ రచయిత కనుకుంట్ల చంద్రబోస్ తన గ్రామ ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. తన స్వగ్రామం జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం చల్లగరిగ గ్రామంలో సొంత నిధులతో ఆస్కార్ పేరిట ఓ గ్రంథాలయాన్ని నిర్మించారు. ఈ ఆస్కార్ గ్రంథాలయ ప్రారంభోత్సవం గురువారం జరగనుంది. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'తో బుధవారం ఫోన్‌లో మాట్లాడిన చంద్రబోస్.. 'గ్రామస్థులకు ఇచ్చిన మాట ప్రకారం సరస్వతి గుడిని నిర్మించా. చాలా సంతోషంగా ఉంది' అని ఆనందం వ్యక్తం చేశారు. చల్లగరిగలోని తమ ఇంటి పక్కన ఉన్న గ్రంథాలయంలో ఎన్నో సాహిత్య పుస్తకాలు చదివానని, వాటి వల్లే తాను ఉన్నత స్థాయికి ఎదిగానని ఈ సందర్భంగా చెప్పారు. ఆర్ఆర్ఆర్ సినిమాకు తాను రాసిన నాటునాటు పాటకు ఆస్కార్ అవార్డు రావడంతో బాల్య మిత్రులు, గ్రామ ప్రజలు తనని సన్మానించారని చెప్పారు. ఆ సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతూ గ్రామంలో అత్యాధునిక హంగులతో గ్రంథాలయ భవనం నిర్మిస్తానని ఇచ్చిన మాటను ఈ రోజున నిలబెట్టుకున్నానని వివరించారు. అందరి సహకారంతో రూ. 36లక్షల వ్యయంతో ఎనిమిది నెలల్లో భవనాన్ని సిద్ధం చేసి ఆస్కార్ గ్రంథాలయం అని నామకరణం చేశామని చెప్పారు. కాగా, రచయిత చంద్రబోస్ తన సొంత నిధులతో నిర్మించిన ఆస్కార్ గ్రంథాలయ ప్రారంభోత్సవం గురువారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని గ్రంథాలయాల జిల్లా కార్యదర్శి శ్రీలత తెలిపారు.

'జికా'...వస్తోంది జాగ్రత్త

రాష్ట్రాలను అప్రమత్తం చేసిన కేంద్రం.. మహారాష్ట్రలో పెరుగుతున్న కేసులతో ఆందోళన

- సంసిద్ధంగాలేని తెలంగాణ వైద్యశాఖ
- కనీస చర్యలూ తీసుకోని వైనం
- ఇప్పటికే రాష్ట్రంలో సీజనల్ వ్యాధుల విజృంభణ



హైదరాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): పొరుగు రాష్ట్రం మహారాష్ట్రలో జికా వైరస్ విజృంభిస్తోంది. రెండు రోజుల క్రితం పుణెలో ఒక్క రోజే ఆరు జికా వైరస్ వ్యాధి (జడ్‌వీడీ) కేసులు నమోదుకావడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. దీంతో అప్రమత్తమైన కేంద్ర ప్రభుత్వం బుధవారం అన్ని రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. ఈమేరకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ (డీజీహెచ్ఎస్) డాక్టర్ అతుల్‌గోయల్ అడ్వైయిజరీ జారీ చేశారు. జికాపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా గర్భిణులను స్క్రీనింగ్ చేయాలని కేంద్రం కోరింది. జికా వైరస్ పాజిటివ్‌గా నిర్ధారణ అయిన గర్భిణుల్లో పిండం ఎదుగుదలను పర్యవేక్షించాలని సూచించింది. ప్రతి ఆస్పత్రిలో కచ్చితంగా ఒక నోడల్ ఆఫీసర్‌ను నియమించాలని, ఆ అధికారి జికా వైరస్ వ్యాప్తికి కారణమయ్యే దోమల పెరుగుదల నివారణకు చర్యలు చేపట్టాలని కోరింది. జికా కేసులు నమోదైతే వెంటనే నేషనల్ సెంటర్ ఫర్ వెక్టర్ బోర్న్ డిసీజ్ కంట్రోల్ (ఎన్‌సీవీబీడీసీ)కు రిపోర్టు చేయాలని, అనుమానిత నమూనాలను పుణెలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి పంపాలని సూచించింది. అలాగే ఐసీఎంఆర్ ఆధ్వర్యంలోని వైరస్ పరిశోధనా కేంద్రాలకు కూడా శాంపిళ్లను పంపాలని ఆదేశించింది.

అప్రమత్తంగాలేని రాష్ట్ర వైద్యశాఖ..

మహారాష్ట్ర నుంచి తెలంగాణకు రోజూ వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఎంతో అప్రమత్తంగా ఉండాలి. ఇలాంటి మహమ్మారులు వచ్చినప్పుడు వాటిని నియంత్రించే బాధ్యత క్షేత్రస్థాయిలో ప్రజారోగ్య సంచాలకులకే ఉంటుంది. అయితే మన వద్ద ఇంతవరకు అందుకు సంబంధించిన కార్యాచరణేమీ కానరావడంలేదు. ఇప్పటికే రాష్ట్రంలో ఒకవైపు డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా వంటి సీజనల్ వ్యాధుల విజృంభణ మొదలైంది. గత ఐదు నెలల్లో మలేరియా, డెంగ్యూ మరణాలు కూడా సంభవించాయి. పటిష్ఠ పర్యవేక్షణ లేకపోవడంతో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా క్షేత్రస్థాయిలో వీటిపై అవగాహన ఉన్న విభాగాధిపతి లేకపోవడం ప్రధాన సమస్యగా మారిందని వైద్యవర్గాలు చెబుతున్నాయి. అందుకే సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

దోమల ద్వారా వ్యాప్తి..

జికా వైరస్ అనేది దోమల ద్వారా సంక్రమించే ఫ్లేవి వైరస్. జికా ప్రధానంగా ఏడెస్ దోమల కాటు ద్వారా వ్యాపిస్తుంది. ఇదే దోమ కుడితే డెంగ్యూ, చికున్‌గున్యా, ఎల్లో ఫీవర్ వైరస్‌లు కూడా సోకుతాయి. జికా సోకితే సాధారణ లక్షణాలే ఉంటాయి. ఇవి 2-7 రోజులపాటు కనిపిస్తాయి. ముఖ్యంగా జ్వరం, దద్దుర్లు, కీళ్ల నొప్పి, కండ్లకలక (ఎరుపు కళ్లు), కండరాలు, తలనొప్పితో పాటు మరికొన్ని తీవ్రమైన సమస్యలు కలుగుతాయి. మైక్రోసెఫాలీ (పుట్టుక లోపం), గులియన్ బారే సిండ్రోమ్ (న్యూరోలాజికల్ డిజార్డర్), మెనింజైటిస్ (మెదడు, వెన్నెముక లైనింగ్ వాపు)లాంటి వాటికి కారణమౌతుంది.

నివారణ ఎలాగంటే..

దోమల వృద్ధిని నివారించడానికి ఇళ్లు, బహిరంగ ప్రదేశాల చుట్టూ నిలిచిన నీటిని తొలగించాలి. జికా కూడా లైంగికంగా సంక్రమించే అవకాశం ఉన్నందున సురక్షితమైన విధానాలను పాటించాలి. జికాకు నిర్దిష్ట చికిత్స లేదు, కానీ లక్షణాల ఆధారంగా చికిత్సను అందిస్తారు. జికా లక్షణాలు కనిపిస్తే వెంటనే సరైన రోగ నిర్ధారణ పరీక్షలు చేయించుకుని డాక్టర్‌ను సంప్రదించాలి.



సిద్దిపేట జిల్లా రాయపోల్‌లో గుర్తించిన సిడితల వీరగల్లు

తల నరుక్కొంటే.. శివ సన్నిధికి చేరుకుంటామని..

- చాళుక్యులు, రాష్ట్రకూటుల కాలంలో శైవుల్లో ఈ విశ్వాసం
- 'సిరితల వీరగల్లు'గా ప్రశస్తి.. సిద్దిపేట జిల్లా రాయల్‌పోల్‌లో విగ్రహం లభ్యం

రాయపోల్, జూలై 3: ప్రాణార్పన చేస్తే దేవుడి సన్నిధికి చేరుకుంటామని నమ్మడం.. ఓ పదునైన ఆయుధంతో తమ తలను తామే నరుక్కోవడమో.. మరొకరితో నరికించుకోవడమో చేయడం గురించి విన్నారా? 6వ శతాబ్దం నుంచి 12వ శతాబ్దం వరకు నడిచిన చాళుక్యుల కాలంలో, అప్పట్లోనే రాష్ట్రకూటుల హయాంలో శైవభక్తుల్లో ఈ విశ్వాసం ఉండేదట! భాసింపట్టు వేసుకున్న స్థితిలో తలపైన ఉన్న జుట్టు సాయంతో తాటిచెట్టుకో.. వెదురు చెట్టుకో వేలాడుతున్న వ్యక్తితో ఉన్న ఆ శిల్పాన్ని చూస్తున్నారా? ఆ వ్యక్తి చేతులు ముకుళితమై ఉన్నాయి. తల నుంచి మొండెం వేరయినట్లుగా మధ్యలో గ్యాప్‌ను స్పష్టంగా గమనించొచ్చు! ఈ శిల్పాన్ని 'సిడితల వీరగల్లు' అంటారు. శైవభక్తులు ఆత్మబలిదానాలను ధర్మకార్యంగా భావించేవారు. శివసన్నిధికి చేర్చే తక్షణ మార్గంగా ఆత్మబలిదానాలను ఎంచుకునేవారు. పైగా తల నరుక్కొని మరణిస్తే, తమ ప్రాణాలను తీసుకెళ్లేందుకు దేవాంగనలు వస్తారని విశ్వసించేవారు. ఈ శిల్పంలో.. పైన ఇద్దరు మహిళలుండటాన్ని గమనించవచ్చు! ఫొటోలో కనిపిస్తున్న ఈ 'సిడితల వీరగల్లు' సిద్దిపేట జిల్లా రాయపోల్‌లోని పురాతన గణపతి ఆలయం ప్రాంగణంలోనిది. దీన్ని కొత్త తెలంగాణ చరిత్ర బృందం పరిశోధకుడు కొలిపాక శ్రీనివాస్ గుర్తించి.. వివరించారు. మహిళా సిడితల వీరగల్లులు జనగామ జిల్లా లింగపల్లిలో లభించాయి. పురుష సిడితల వీరగల్లులు ఇప్పటిదాకా యాదాద్రి జిల్లా చొల్లేరులో, వనపర్తి జిల్లా కేంద్రంలో లభించగా రాయపోల్‌లోనిది మూడోది. ఇక సిడితల వీరగల్లులు కాకుండా కేవలం వీరగల్లులూ ఉంటాయి. తోటి ప్రజలను, పాడిపశువులను కాపాడే క్రమంలో అడవి జంతువులతో పోరాడి చనిపోతే, యుద్ధాల్లో పాల్గొని ప్రాణాలు కోల్పోతే వారిని వీరగల్లుగా చెక్కి ప్రజలు ఆరాధించేవారు.

పెంటారెడ్డి పదవీకాలం ఆర్నెల్లు పొడిగింపు

నీటిపారుదలశాఖలో ఎత్తిపోతల పథకాల సలహాదారుడు కె.పెంటారెడ్డి పదవీ కాలాన్ని మరో ఆర్నెల్ల పాటు పొడిగిస్తూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్‌బొజ్జా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పెంటారెడ్డి పదవీకాలం పొడిగింపు నిర్ణయం మే 16 నుంచి ఆరునెలల పాటు అమలులో ఉండనుంది.

కుటుంబాన్ని మింగేసిన మద్యం రాకాసి

- మద్యానికి బానిసైన భర్త వేధింపులు తాళలేక..
- ముగ్గురు కుమార్తెలతో కలిసి తల్లి ఆత్మహత్యాయత్నం
- చికిత్స పొందుతూ తల్లీ, ఓ కూతురు మృతి



అనిత



రమ్య

కాగజ్‌నగర్, జూలై 3: ఐదుగురు ఆడపిల్లల తండ్రి అయిన ఓ వ్యక్తి బాధ్యతలు మరచి మద్యానికి బానిసై వేధింపులకు గురి చేస్తుండడంతో జీవితంపై విరక్తి చెంది అతని భార్యాబిడ్డలు ఆత్మహత్యకు యత్నించారు. భార్య, ఓ కుమార్తె మరణించగా మరో ఇద్దరు కూతుళ్ల పరిస్థితి విషమంగా ఉంది. ఇలా కుమరం భీం జిల్లా కాగజ్‌నగర్ మండలం గజ్జిగూడ గ్రామానికి చెందిన ఓ కుటుంబాన్ని మద్యం మింగేసింది. వివరాలిలా ఉన్నాయి. గజ్జిగూడకు చెందిన ప్రతాప్‌కు భార్య అనిత(55), ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. వీరిలో పెద్ద కూతురికి వివాహమవ్వగా లక్ష్మి(21), రవళి(18), రమ్య(16), ఐశ్వర్య(14) ఇంటి వద్దే ఉంటున్నారు. మద్యానికి బానిసైన ప్రతాప్ తాగిన మైకంలో గ్రామస్థులతో నిత్యం గొడవలు పడుతుండేవాడు. ఆర్థిక ఇబ్బందులతో తమకున్న వ్యవసాయ భూమిలో కొంత భాగాన్ని అమ్మేశాడు. మిగిలిన కొద్దిపాటి భూమిలో వ్యవసాయం చేస్తూ అనిత కుటుంబాన్ని పోషించేది. ఈ క్రమంలో 15 రోజుల క్రితం పొలం వద్ద జరిగిన గొడవలో భాగంగా ప్రతాప్ ఓ వ్యక్తిపై గొడ్డలితో దాడి చేశాడు. దీంతో హత్యాయత్నం కేసులో ప్రతాప్ జైలుకెళ్లాడు. అయితే, గ్రామ ప్రజల సాయంతో ప్రతాప్‌కు బెయిల్ ఇప్పించిన అనిత భర్తను జైలు నుంచి బయటకు తీసుకొచ్చింది. ఆ తర్వాత కూడా ప్రతాప్ తీరుమారకపోవడంతో మద్యం మానేయాలంటూ అనిత సోమవారం గొడవపడింది. ఇందుకు ఆగ్రహం వ్యక్తం చేసిన ప్రతాప్ భార్య అనితపై దాడి చేసి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన అనిత.. కుమార్తెలు రమ్య, లక్ష్మీ, ఐశ్వర్య, రవళితో కలిసి పొలానికి వెళ్లి ఆత్మహత్య చేసుకుందామని చెప్పింది. రవళి మినహా తల్లీకూతుళ్లు అందరూ పురుగు మందు తాగేశారు. రవళి కేకలు విని అక్కడికి వచ్చిన చుట్టుపక్కల పొలాల్లోని వారు అనిత, ఆమె కుమార్తెలను ఆస్పత్రికి తరలించారు. అయితే, రెండ్రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అనిత, రమ్య బుధవారం మృతి చెందారు. లక్ష్మి, ఐశ్వర్య పరిస్థితి విషమంగా ఉంది. మరోపక్క, ప్రతాప్‌ను పోలీసులు అరెస్టు చేశారు.

పిడుగుపాటు కాదు.. అంతర్గత లోపమే

- 'భద్రాద్రి పవర్ ప్లాంట్' ప్రమాదంపై తేల్చిన జెన్‌కో..



హైదరాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో ప్రమాదానికి అంతర్గత లోపాలే కారణమని తేలింది. పిడుగుపాటు వల్ల ప్రమాదం జరగలేదని జెన్‌కో స్పష్టం చేసింది. భద్రాద్రి పవర్ ప్లాంట్ ఒక్కోటి 270 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాలుగు యూనిట్లు (1080 మెగావాట్లు) ఉండగా.. అందులో 270 మెగావాట్ల సామర్థ్యం కలిగిన యూనిట్-1లోని జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్ గత శనివారం అగ్నిప్రమాదం జరిగి కాలిపోయింది. అయితే దీనికి పిడుగుపాటే కారణమని తొలుత ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణ జెన్‌కో అధికారులతో విచారణ జరిపించారు. పిడుగు పడిన సమయంలోనే యాదృచ్ఛికంగా జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్ అంతర్గత లోపాలతో, దాని లోపల మంటలు ఉత్పన్నమయ్యాయని, ఇందుకు బాహ్య కారణాలు లేవని తేల్చారు. దీనిపై ప్రభుత్వానికి జెన్‌కో తాజాగా ఓ నివేదిక సమర్పించింది. ట్రాన్స్‌ఫార్మర్‌లో ఓ వ్యవస్థ దెబ్బతిని.. ఆయిల్ లీకేజీ చోటుచేసుకుని పూర్తిగా దగ్ధమైందని అందులో అధికారులు వివరించారు. ప్రాథమిక అంచనా ప్రకారం రూ.30 కోట్లకు పైగా నష్టం జరిగినట్టు ఇప్పటికే ఓ నిర్ధారణకు వచ్చారు. అయితే ట్రాన్స్‌ఫార్మర్‌ను పూర్తిగా విప్పి పరిశీలించిన తర్వాత నష్టంపై పూర్తి స్పష్టత రానుందని ప్రభుత్వానికి జెన్‌కో నివేదించింది. ట్రాన్స్‌ఫార్మర్‌లో అంతర్గత లోపాలు ఏర్పడడానికి నిర్మాణ, నిర్వహణ, పర్యవేక్షణ లోపాలు కారణమై ఉండవచ్చని భావిస్తున్నారు.

పొలంలోనే రైతుకు గుండెపోటు

సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడిన ఆర్ఎంపీ

దమ్మపేట, జూలై 3: సాగు చేసే పొలంలోనే రైతుకు గుండెపోటు రావటంతో ప్రాణాపాయస్థితిలో వున్న వ్యక్తికి ఆర్ఎంపీ వైద్యుడు సీపీఆర్ చేసి ప్రాణం కాపాడిన ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం ముష్టిబండ గ్రామంలో బుధవారం జరిగింది. ఈ ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ముష్టిబండ గ్రామానికి చెందిన జగన్నాధపురపు సత్యనారాయణ వ్యవసాయ పనులు నిమిత్తం ఉదయం పొలానికి వెళ్ళాడు. పొలానికి వెళ్లి వ్యవసాయ పనులు నిర్వహిస్తున్న క్రమంలో నీరసంగా వుందంటూ పడిపోయాడు. వెంటనే ప్రక్కనే వున్న రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వటంతో పాటు స్థానికంగా వున్న ఆర్ఎంపీ వైద్యుడు కేశవ్ సమాచారం ఇచ్చారు. వెంటనే వైద్యుడు పొలం వద్దకు నేరుగా వెళ్లి రైతను పరీక్షించాడు. బీపీ హైగా వుండటంతో పాటు అపస్మారక స్థితిలో వుండటంతో వెంటనే సీపీఆర్ చేయటంతో కొద్ది సేపటికి రైతు స్పృహలోకి వచ్చి తేరుకున్నాడు. వెంటనే రైతు సత్యనారాయణను సత్తుపల్లి లోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించి చికిత్స నిర్వహించారు.



పోలీసుల అదుపులో ముగ్గురు మహిళలు?

జూలూరుపాడు, జూలై 3: మండలంలోని పడమట నర్సాపురం గ్రామంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ముగ్గురు మహిళలను బుధవారం జూలూరుపాడు పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. సదరు మహిళలు పడమట నర్సాపురంలోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల సమీపంలోని సెల్‌టవర్ వద్ద సంచరిస్తుండటంతో గ్రామస్థులు 100కు సమాచారాన్ని అందించారు. దీంతో పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి ముగ్గురు మహిళలను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. వారి వివరాలను సేకరించగా తమది మణుగూరు అని, చెత్తకాగితాలను ఏరుకునేందుకు వచ్చినట్లు పోలీసులకు తెలిపారు. కాగా ఇటీవల మండలంలో పలు గ్రామాల్లోని రైతుల పొలాల్లోని వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ వైరు చోరీకి గురైంది. సదరు మహిళలు సెల్‌టవర్ సమీపంలో సంచరిస్తున్న క్రమంలో ఏమైనా చోరీకి పాల్పడేందుకు వచ్చారన్న కోణంలో జూలూరుపాడు పోలీసులు, సీసీఎస్ సిబ్బంది విచారణ నిర్వహిస్తున్నట్టు సమాచారం.

అనారోగ్యంతో మండల పరిషత్ సూపరింటెండెంట్ మృతి



శ్రీనివాసరావు(ఫైల్)

ముదిగొండ, జూలై 3: అనారోగ్యంతో ముదిగొండ మండల పరిషత్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు (50) బుధవారం మృతిచెందారు. శ్రీనివాసరావు గత కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందారు. ఆయన మృతి పట్ల ఎంపీపీ సామినేని హరిప్రసాద్, జడ్పీటీసీ పసుపులేటి దుర్గ, ఎంపీడీవో శ్రీధర్‌స్వామి, ఎంపీవో సూర్యనారాయణ, కార్యాలయ సిబ్బంది సంతాపం తెలిపారు.

విద్యుదాఘాతానికి మూడు పాడి గేదెలు బలి

కామేపల్లి, జూలై 3: విద్యుదాఘాతానికి మూడు పాడి గేదెలు మృతిచెందిన సంఘటన కామేపల్లి మండలం కొత్తలింగాలలో బుధవారం చోటు చేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తలింగాలకు చెందిన నేలపట్ల గోపాల్‌రావుకు చెందిన మూడు పాడి గేదెలు గ్రామశివారులోని ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర మేత మేస్తున్నాయి. ఈ క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్ సంబంధించిన స్టే వైర్ తగిలి మూడు పాడి గేదెలు మృతి చెందాయి. ఈ మూడు గేదెల విలువ సుమారు రూ.2లక్షల వరకు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు. విద్యుత్ శాఖ అధికారులే ఆదుకోవాలని కోరాడు.



చేనేత సహకార సంఘాల నాయకులతో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

చేనేతకు ప్రభుత్వం సంపూర్ణ సహకారం

- సహకార సంఘాల నాయకులతో మంత్రి తుమ్మల

ఖమ్మం సంక్షేమ విభాగం, జూలై 3: రాష్ట్ర ప్రభుత్వం చేనేత సహకార సంఘాలకు సంపూర్ణమైన మద్దతు అందిస్తున్నదని, ఇప్పటికే ఉన్న వస్త్ర నిల్వలను ప్రభుత్వ శాఖలకు కేటాయింపు జరుగుతుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హామీ ఇచ్చారు. బుధవారం హైదరాబాద్‌లో చేనేత, జౌళి అధికారులతో కలిపి రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ చేనేత వస్త్రాల కొనుగోలుకు ప్రభుత్వ ప్రాధాన్యం పెంచుతామన్నారు. ఇప్పటి వరకు ఉన్న బకాయిలను పూర్తి స్థాయిలో అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా సహకార సంఘాల నాయకులు మంత్రి తుమ్మలను ఘనంగా సన్మానించారు. నేతన్న మా, పావలా వడ్డీకే రుణాలను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చేనేత, జౌళిశాఖ ప్రిన్స్‌పల్ కార్యదర్శి శైలజా రామయ్యర్ పాల్గొన్నారు.

వివాదాస్పద భూమికి రిజిస్ట్రేషన్!

- తల్లి భూమిలో తనకు వాటా ఉందని కుమార్తె ఆవేదన
- పసుపు కుంకుమ కింద అగ్రిమెంటు రాసిచ్చిన తల్లి
- తహసీల్దార్ కార్యాలయం ఎదుట బాధితురాలి ఆందోళన



ఆందోళన వ్యక్తం చేస్తున్న బాధితులు

చింతకాని, జూన్ 3: చింతకాని రెవెన్యూ కార్యాలయంలో వరుసగా భూవివాదాలు చోటు చేసుకుంటున్నాయి. వివరాల్లోకి వెళ్తే తోబుట్టువుల కుటుంబ తగాదాల్లో ఉన్న వివాదాస్పద భూమికి తహసీల్దార్ రిజిస్ట్రేషన్ చేశారని, తన తల్లి తనకు పసుపు కుంకుమ కింద ఇచ్చిన భూమిని తనకు తెలియకుండా తన తోబుట్టువులకు తహసీల్దార్ ఎలా రిజిస్ట్రేషన్ చేస్తారని మండల పరిధిలోని లచ్చగూడెం గ్రామానికి చెందిన చింతాల వెంకట్రావమ్మ బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆందోళన చేసింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. పందిళ్లపల్లి రెవెన్యూ పరిధిలోని 284 సర్వే నెంబర్‌లో అదే గ్రామానికి చెందిన మండె తులశమ్మకు రెండెకరాల భూమి ఉంది. ఆమె తనకున్న భూమిలో ఇద్దరు కుమార్తెలు చింతాల వెంకట్రావమ్మ, చింతాల నాగమణిలకు చెరో పది కుంటలు పసుపు కుంకుమ కింద ఇస్తున్నట్లు 2020వ సంవత్సరంలో అగ్రిమెంటు రాసింది. తల్లి రాసిచ్చిన వ్యవసాయ భూమిని పట్టా చేయించుకోకుండా ఉన్న విషయాన్ని ఆసరాగా తీసుకున్న తులశమ్మ నలుగురు కుమారులు తల్లికున్న రెండెకరాలు రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు జూన్ 26న స్లాట్ బుక్ చేయించారు. విషయం తెలుసుకున్న తులశమ్మ కుమార్తెలు తమకు పసుపు కుంకుమ కింద ఇచ్చిన భూమిని అన్నలకు రిజిస్ట్రేషన్ చేయొద్దని తల్లి తమ పేరిట రాసిచ్చిన అగ్రిమెంట్లను చూపించారు. ఈ విషయంలో తులశమ్మ కుమార్తెలకు, కుమారులకు తీవ్ర వాగ్వాదం జరిగింది. తహసీల్దార్ కార్యాలయం సాక్షిగా కర్రలతో దాడులు చేసుకున్నారు. కానీ తహసీల్దార్ గత సోమవారం ముగ్గురికి, మరొకరికి బుధవారం రోజున ఒక్కొక్కరికి 20కుంటల చొప్పున రిజిస్ట్రేషన్ చేశారని బాధిత కుమార్తెలు ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకుని తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని వివాదంలో ఉన్న భూమిని రిజిస్ట్రేషన్ చేయవద్దని చెప్పినప్పటికీ ఎలా చేశారని బాధితులు తహసీల్దార్‌ను ప్రశ్నించగా.. మీ తల్లి మీకు రాసిచ్చిన అగ్రిమెంట్ చెల్లదని, కోర్టుకు వెళ్లి కోర్టు ఆర్డర్ తెచ్చుకుంటే రిజిస్ట్రేషన్ ఆపుతామని చెప్పడంతో తహసీల్దార్ తీరుపై మండిపడుతూ కార్యాలయం ఎదుట బాధితులు ఆందోళన నిర్వహించారు. తహసీల్దార్ పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకుని తన తల్లి దగ్గర భూమిని కొనుగోలు చేసినట్లుగా అగ్రిమెంట్లు రాయించి నలుగురు కుమారులకు రిజిస్ట్రేషన్ చేశారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్‌ను కలిసి న్యాయం జరిగేలా కోరతామని బాధితులు తెలిపారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

ఖమ్మం క్రైం, జూలై 3: నగరంలో వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి గంజాయి తరలిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చెరువుబజార్ ప్రాంతానికి చెందిన దుగ్గిరాల సూర్యనారాయణ అనే వ్యక్తి మూడు కేజీల గంజాయిని తీసుకుని మమతా ఆసుపత్రి వైపు వెళుతుండగా గమనించిన పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో గంజాయి విక్రయించేందుకు తీసుకెళుతున్నట్టు తెలపడంతో అతనివద్ద ఉన్న మూడు కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్టు పోలీసులు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వామ్యం కావాలి

- పర్యావరణంపై అవగాహన అవసరం
- డీఈవో వెంకటేశ్వరచారి



మాట్లాడుతున్న డీఈవో వెంకటేశ్వరచారి

కొత్తగూడెం, జూలై 3 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో అందరు భాగస్వామ్యం కావాలని, విద్యార్థి దశ నుంచే పర్యావరణంపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం. వెంకటేశ్వరచారి అన్నారు. బుధవారం కొత్తగూడెంలోనే సింగరేణి ఉన్నత పాఠశాలలో నేషనల్ గ్రీన్ కార్ప్స్ (ఎన్‌జీసీ) ఆధ్వర్యంలో విద్యార్థులకు కవిత్వం పోటీలు, డ్రాయింగ్ పోటీలు (పోస్టర్ మేకింగ్) నిర్వహించారు. ఈ పోటీలు భూమి పునరుద్ధరణ, ఎడారీకరణం, కరువును తట్టుకునే అంశాలపై పోటీలు జరిగాయి. జిల్లా సైన్స్ ఆఫీసర్ ఎస్. చలపతిరాజు పర్యావరణం - పాఠశాల స్థాయిలో చేయవల్సిన పనుల గురించి వివరించారు.

విపత్కర పరిస్థితులను ఎదుర్కోవడానికి సిద్ధం

- అందుబాటులో విపత్తుల నివారణ దళం: ఎస్పీ



అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్ రాజ్

కొత్తగూడెం, జూలై 3 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు జిల్లా ప్రజలకు అందుబాటులో ఉండేందుకు జిల్లా పోలీస్ శాఖ తరఫున జిల్లా విపత్తుల నివారణ దళం సిద్ధంగా ఉందని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు. లోతట్టు జలమయమైతే ఆపదలో ఉన్న వారిని కాపాడే విధంగా ఈ డీడీఆర్ఎఫ్ బృందంలోని సభ్యులు పూర్తిస్థాయిలో శిక్షణ పొందారని తెలిపారు. ప్రజలకు ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైన వెంటనే డయల్ 100కు ఫోన్ చేసి పోలీస్ వారికి సమాచారం అందిస్తే వెంటనే డీడీఆర్ఎఫ్ బృందం అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపడుతామని అన్నారు. డీడీఆర్ఎఫ్ బృందానికి రెస్క్యూ సమయంలో కావాల్సిన అన్ని రకాల సామగ్రిని అందజేశామని అన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ పరితోష్ పంకజ్, భద్రాచలం ఏఎస్పీ అంకిత్‌కుమార్ సంక్వార్, ఆర్ఐ ఆపరేషన్స్ రవి, అడ్మిన్ లాల్‌బాబు, ఎంటీవో సుధాకర్ పాల్గొన్నారు.


ఎస్పీ కార్యాలయంలో పాము

పట్టుకున్న ప్రాణధార ట్రస్ట్ సభ్యులను అభినందించిన ఎస్పీ



పామును పట్టుకున్న ప్రాణధార ట్రస్ట్ సభ్యులను అభినందిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూలై 3: భద్రాద్రి ఎస్పీ కార్యాలయంలోనికి బుధవారం పాము వచ్చింది. దీంతో సిబ్బంది ప్రాణధార ట్రస్ట్ సభ్యులకు సమాచారాన్ని అందజేయగా ఎస్పీ కార్యాలయానికి చేరుకున్న ట్రస్ట్ వ్యవస్థాపకులు సంతోష్ ఆ పామును పట్టుకున్నారు. దీంతో ట్రస్ట్ సభ్యులను భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు ప్రత్యేకంగా అభినందించారు. పర్యావరణంలో వన్య ప్రాణులైన సర్పాలు భాగమేనని, వాటి గురించి అవగాహన అందరికి అందజేయాలని ట్రస్ట్ సభ్యులను ఎస్పీ కోరారు. అదే విధంగా జిల్లాను ప్లాస్టిక్ రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ఎస్పీ పిలుపునిచ్చారు.



కొత్తగూడెం ఓఎస్డీ, భద్రాచలం ఏఎస్పీల బాధ్యతల స్వీకరణ

కొత్తగూడెం, జూలై 3 (ఆంధ్రజ్యోతి)/భద్రాచలం : ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జరిగిన బదిలీల పక్రియలో భాగంగా భద్రాచలం ఏఎస్పీగా పని చేస్తున్న పరితోష్ పంకజ్ పదోన్నతి పొంది కొత్తగూడెం ఓఎస్డీగా బుధ వారం బాధ్యతలు స్వీకరించారు. అదేవిధంగా జనగాం ఏఎస్పీగా పని చేస్తున్న అంకిత్ కుమార్ సంక్వార్ బదిలీపై భద్రాచలం ఏఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు.అనంతరం ఈ ఇరువురు అధికారులు ఎస్పీ రోహిత్ రాజ్‌ని మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కలను అందజేశారు. బాధ్యతలు స్వీకరిం చిన అధికారులు ఇద్దర్ని జిల్లా ఎస్పీ అభినందించారు.



ఎస్పీ రోహిత్‌రాజ్‌తో ఓఎస్డీ, ఏఎస్పీ

బొగ్గు గనుల టెండర్లను అడ్డుకుంటాం

- బొగ్గు బ్లాక్‌లను సింగరేణి సంస్థకు అప్పగించాలి
- సీపీఐ, ఏఐటీయూసీ, టీబీజీకేఎస్ డిమాండ్

కొత్తగూడెం, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు చెందా ల్సిన బొగ్గు సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టపెట్టేందుకే కేంద్రంలోని మోడీ సర్కార్ బొగ్గుబ్లాక్‌లను వేలంవేసేం దుకు సిద్ధమైందని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్ పాషా, సీపీఎం జిల్లా నాయకులు అన్నవరపు సత్యనారా యణ, న్యూడెమోక్రసీ జిల్ల నాయకులు గౌని నాగేశ్వరరా వులు అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న బొగ్గుగనుల వేలం నిర్ణయాన్ని నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా నిర్వహించే ఆందోళన, పోరాట కార్యక్రమాలపై బుధవారం సీపీఐ జిల్లా కార్యాలయంలో జరిగిన వామపక్షాల రౌండ్ టేబుల్ సమా వేశంలో నాయకులు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వానికి దేశాన్ని, దేశ సంపదను రక్షించాలని ఆలోచన లేదని, కేవలం ఆదాని, అంబాని లాంటి కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేయడమే పనిగా పెట్టుకుందన్నారు. అధికారం రాకముందు రాష్ట్ర కాంగ్రెస్ గనుల వేలాన్ని వ్యతిరేకించి అధికారం రాగానే వేలాన్ని సమర్థించడం సిగ్గుచేటన్నారు. తక్షణమే వేలం పక్రియను ఉపసహరించుకుని సింగరేణికి బొగ్గుబ్లాక్‌లను అప్పగించి సంస్థను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌ముట్టడి చేపడుతు న్నట్లు తెలిపారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో వామప క్షాల నాయకులు కంచర్ల జమలయ్య, లిక్కి బాలరాజు, భూక్యా దస్రు, పి. శ్రీనిఆస్, బాణోత్ ఉక్లా, నూనావత్ గోవిందు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మ దహనం

కొత్తగూడెంలోని సింగరేణి హెడ్డాఫీస్ ఎదుట బుధవారం బీఆర్ఎస్ తెలంగాణ బొగ్గుగని కార్మికసంఘం సంయుక్తంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మలను దగ్ధం చేశారు. తెలం గాణ బొగ్గుగని కార్మికసంఘంచీఫ్ ప్రధాన కార్యదర్శి కాపు కృ ష్ణ, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ కూసన వీరభద్రం మాట్లాడారు.



మాట్లాడుతున్న నాయకులు

బొగ్గు బ్లాక్‌ల వేలం రద్దు చేయాలి: ఏఐటీయూసీ

బొగ్గు బావుల వేలాన్ని వెంటనే నిలిపివేయాలని ఏఐటీ యూసీ రాష్ట్ర కార్యదర్శి సింగ్ నర్సింహారావు పిలుపుని చ్చారు. కొత్తగూడెంలోని శేషగిరిభవన్‌లో జరిగిన ఏఐటీ యూసీ జిల్లా ఆఫీసర్ బ్యారర్ల సమావేశంలో మాట్లాడారు.

కేంద్ర ప్రభుత్వ వైఖరి సింగరేణి అభివృద్ధికి ఆటంకం

● మణుగూరు: సింగరేణి కాలరీస్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ వైఖరి ఆటంకాన్ని కల్గిస్తోందని సింగరేణి బ్లాక్‌ను ప్రవేటు పరం చేసే ఆలోచనలు వెంటనే విరమించుకోవా లని ఏఐటియూసీ జనరల్ సెక్రటరీ రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం మణుగూరు ఏరియాలో పర్యటించిన రాజ్‌కుమార్, మిర్యాల రంగయ్యలు ఏరియా లోని పలు గనుల్లో పిట్ సమావేశాలు నిర్వహించి కార్మికు లతో మాట్లాడారు. సమావేశంలో నాయకులు డిప్యూటీ జనరల్ సెక్రటరీ మిర్యాల రంగయ్య, సీపీఐ పార్టీ రాష్ట్ర నేత బి అయోధ్య, మణుగూరు బ్రాంచ్ నాయకులు వై రాంగోపాల్,రామనర్సయ్య, ఈశ్వర్, సురేందర్, శనిగరపు కుమార స్వామి, కోడిరెక్కల శ్రీనివాసరావు, దుర్గ్యాల సుదా కర్, ఇబ్రహీం, తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు గనుల వేలాన్ని నిరసిస్తూ ఆందోళన

మణుగూరు: సింగరేణి కాలరీస్ కంపెనీలో కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనుల వేలం పాటను నిర్వహించి ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు సిద్ధమౌతుందని దీనిని తాము తీవ్ర స్థాయిలో వ్యతిరేకిస్తున్నామని ప్రకటిస్తూ టీబీజీకేఎస్ యూనియన్ మణుగూరులో బుధవారం నిరసన ఆందోళన కార్యక్రమాలను నిర్వహించింది.

బొగ్గు గనుల ప్రవేటికరణ నిలుపుదల చేయాలి

ఇల్లెందు: కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనుల వేలం నిలిపివే యాలని రాష్ట్రంలోని బొగ్గు గనులను సింగరేణి ఇవ్వాలని కోరుతూ బుదవారం ఇల్లెందు పట్టణంలో బీఆర్ఎస్ ఆధ్వ ర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. బీఆ ర్ఎస్ మాజీ జిల్లా అధ్యక్షుడు దిండిగల రాజేందర్, టీబీజీకే ఎస్ నాయకులు జాఫర్ హుస్సెన్ మాట్లాడారు.

సింగరేణి మనుగడకై ఉద్యమించాలి

ఇల్లెందు టౌన్: తెలంగాణలో ఉన్న ఏకైక ప్రభుత్వ రంగ పరిశ్రమ అయిన సింగరేణి మనుగడ కోసం కార్మికవర్గం ఉద్యమించాలని సింగరేణికాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐ టీయూసీ) బ్రాంచి కార్యదర్శి ఎండి. నజీర్ అహ్మద్, ఉపాధ్య క్షులు దాసరి రాజారాంలు పిలుపునిచ్చారు. బుధవారం జీకే 5 ఓసీలో సింగరేణిలో ప్రైవేటీకరణలను నిరసిస్తూ పిట్ సమావే శాలను నిర్వహించారు.

భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణం అందిద్దాం

- వనమహోత్సవంలో కొత్తగూడెం, అశ్వారావుపేట ఎమ్మెల్యేలు కూనంనేని, జారే ఆదినారాయణ

కొత్తగూడెం, జూలై 3 (ఆంధ్రజ్యోతి)/ అశ్వారావుపేట: భావతరాలకు స్వచ్ఛమైన వాతావర ణాన్ని అందించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆధు నిక పోకడలతో వాతావరణాన్ని కలుషితం చేస్తే భావి తరాలు క్షమించబోవని ఎమ్మెల్యే కూనంనేని సాంబశి వరావు అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలోని కార్తీకవనంలో 75వ వన మహోత్సవాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వాతా వరణం కలుషితం కావడం వల్ల ఉపద్రవాలు సంభవి స్తున్నాయని, అకాల వర్షాలు, సునామీలు, అధిక ఎండలు వంటివి వాతావరణం కలుషితం కావడం వల్లేనన్నారు. అడవులను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, పోడు వ్యవసాయం వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందన్నారు. ప్రజలు కొత్తపోడు వ్యవసాయం వైపు వెళ్లొద్దని, అడవులను పరిరక్షిం చేవిషయంలో అటవీశాఖాధికారులకు సహాకరించాలని సూచించారు. అనంతరం కార్తీకవనంలోమొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా, డీఎఫ్‌వోలు కృష్ణగౌడ్, యూ. కోటేశ్వరరావు, ఎస్. సురేష్, ఎఫ్ ఆర్‌వో సురేష్, ఉమా, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత: ఎమ్మెల్యే జారే

అశ్వారావుపేట: మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని, మొక్కలు పెంచడంవల్ల స్వచ్ఛమైన గాలి వస్తుందని, ఆక్సిజన్ లభిస్తుందని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. బుధ వారం వన మహోత్సవంలో బాగంగ అశ్వారావుపేట మండలం, పాపిడిగూడెం సమీపంలో ప్లాంటేషన్‌లో అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పాల్గొని మొక్కలను నాటారు. ఆయ మాట్లాడుతూ మొక్కలవల్ల ప్రకృతి ఎంతో అందంగా ఆహ్లాదక రంగా ఉంటుందని, వర్షాలు సకాలంలో కురిసి తద్వార పంటలు సమృద్ధిగ పండుతాయన్నారు. భావి తరాలకు ప్రాణ దాతగ ఉంటాయన్నారు. ప్రతి ఒక్కరు విరివిగ మొక్కలు నాటాలని, మొక్కలు రక్షించాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులకు మొక్కలు రకాలను గుర్తించేలా క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేసారు. కార్యక్రమంలో అశ్వారావుపేట రేంజ్ అధికారి మురళి, ఇతర అటవీశాఖ సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

వైద్యులు అప్రమత్తంగా ఉండాలి: ఎమ్మెల్యే పాయం

మణుగూరు, జూలై 3: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు ప్రబల కుండా, అస్వస్థతకు గురైప ప్రజలకు వైద్య సేవలందించేందుకు వైద్యులు అప్రమత్తంగా ఉండాలని పిన పాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు వైద్యులకు సూచించారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వైద్యులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఆసుపత్రికి వచ్చేరోగులకు మంచి సేవలందించా లని కోరారు. వర్షకాలంలో టైఫాయిడ్ చికెన్ గున్యామలే రియా, డెంగ్యూ జ్వరాలు ప్రబల కుండా ఆశావర్కర్లను హెల్త్ సెంటర్లను అప్రమత్తం చేయాలన్నారు. మందుల కొరత ఉండే ఉన్నతాధికారుల దృష్టికి విషయాన్ని తీసుకువెళ్లి మందుల కొరత లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం దొరకలేదు ప్రవేటు ఆసుపత్రికి వెళ్లాము అనే మాట రోగుల నుంచి వినిపించకూడదని తెలిపారు. వైద్యశాలకు రావాల్సిన నిధులు రాకుండా పెండింగ్‌లో ఉన్నా యని దీని వల్ల నిర్వహాణ ఇబ్బందికరంగా మారిందని వైద్యులు సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోగా స్పందిం చిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి సత్వర చర్యలను చేపటడతానన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో రాజ్‌కుమార్, మణుగూరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ సునీల్, వైద్యులు శైలేశ్, సంకీర్తన, మనీష్ రెడ్డి, శృతి, మధు, రేవంత్, శివకుమార్ పాల్గొన్నారు.



వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయం

గ్రామాల అభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దాం: ఎమ్మెల్యే జారే

చంద్రుగొండ, జూలై 3: గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతిని ధులు, అధికారులు సమిష్టిగా కృషిచేద్దామని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ కోరారు. బుధవారం చంద్రు గొండ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో జరుగుత్ను అభివృద్ధి పనులు, పారిశుద్ధ్య నిర్వాహణ, అంతర్గత రోడ్ల పరిస్థితిని ప్రతి గ్రామ కార్యద ర్శిని అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో రోడ్లు బురద కాకుండా చర్యలు తీసుకోవాని సూచించారు. పారిశుధ్య నిర్వ హణతో పాటు మురుగునీరు నిల్వకుండా చర్యలు తీసుకుంటే సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉంటాయని తెలిపారు. తనతో ఎప్పుడైనా మాట్లాడవచ్చని, అందరికి అందుబాటులో ఉంటాని తెలిపారు. అందరం కలిసి రాష్ట్రం లోనే అశ్వారావు పేట నియోజకవర్గాన్ని మోడల్ నియోజక వర్గంగా తీర్చిదిద్దు దామని ఎమ్మెల్యే కోరారు. ఈ సమావేశంలో ఎంపీపీ పార్వతి, స్పెషల్ ఆఫీసర్ సంజవరావు, ఎంపీడీవో అశోక్ పాల్గొన్నారు.

జూన్‌లో తగ్గిన బొగ్గు ఉత్పత్తి: జీఎం రామచందర్

మణుగూరుటౌన్, జూలై 3: జూన్‌లో కురిసిన వర్షాలతో కొంత బొగ్గు ఉత్పత్తికి ఆటంకమేర్పడిందని ఏరియా జీఎం దుర్గం రామచందర్ అన్నారు. బుదవారం ఏరియా జీఎం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన జూన్ మాసానికి సంబంధించిన ఉత్పత్తి, ఉత్పాదకత వివరా లను వెల్లడించారు. జూన్ మాసంలో కురిసిన వర్షాల కార ణంగా నిర్ధేశిత లక్ష్యానికిగాను 94 శాతం బొగ్గు ఉత్పత్తిని సాధించామన్నారు. ఉత్పత్తి లక్ష్యం 11.16 లక్షల టన్నులు కాగా 10.52 లక్షల బొగ్గును ఉత్పత్తి చేసామన్నారు. ఏప్రిల్ 1వ తేదినుంచి సరాసరి ఉత్పత్తి శాతం 97 శాతం సాధించా మన్నారు.ఏరియాలో పారిశ్రామిక సంబంధాలు మెరుగ్గానే ఉన్నాయని వివిధ కారణాలతో పదవి విరమణ పొందిన కార్మికులకు సంబంధించి 33 మందికి పెన్షన్, 13 మందికి గ్రాట్యూటి లాంటి టెర్మినల్ బెనిఫిట్స్‌ను సెటిల్ చేశామ న్నారు. కార్యక్రమంలో పీకేఓసీ పీఓ లక్ష్మీపతిగౌడ్, మణు గూరు ఓసీ పీఓ శ్రీనివాసచారి, ఏజీఎం సివిల్ వెంకటేశ్వర్లు, డీజీఎం పర్సనల్ రమేష్, డీజీఎం ఐఈడీ వెంకట్రావ్, ఏరియా ఆసుపత్రి సీఎంఓ మేరికుమార్, డీజీఎంఅండ్ ఏ అనురాధ, సెక్యూరిటీ అధికారి షబ్బీరుద్దీన్, పర్సనల్ అధికారులు సింగు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయని కాంగ్రెస్: రేగా

దుమ్ముగూడెం జూలై 3: తప్పుడు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వ పాలనను పూర్తిగా అటకెక్కించారని బీఆర్ ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు విమ ర్శించారు. గంగోలు ప్రైవేటు ఫంక్షన్ హాలులో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రాన్ని దేశంలోనే రోల్‌మోడల్‌గా నిలిపేందుకు పార్టీ అధ్య క్షుడు కేసీఆర్ తీవ్రంగా శ్రమించారని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను అమలు చేశారన్నారు. స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యచరణ ఏర్పాటు చేస్తా మన్నారు. పర్ణశాల మాజీ సర్పంచ్‌లు వాగె లక్ష్మి, టీడీపీ నాయకులు వాగె వెంకటేశ్వరావులను కండువా కప్పి బీఆర్ఎస్ ఎకు ఆహ్వానించారు. నాయకులు రావులపల్లి రాంప్రసాద్, మానె రామకృష్ణ, మండల అధ్యక్ష, కార్యదర్శులు అన్నె సత్య నారాయణ, కణితి రాముడు, ఎంపీపీ లక్ష్మి, వాసురాజు, దామెర్ల శ్రీనివాసు, శ్రీకాంత్, వెంకటాపురం, వాజేడు మండల నాయకులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా కాంగ్రెస్ పార్టీ : టీపీసీసీ

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూలై 3: భూ బాధితు లకు కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ టీపీసీసీ సభ్యుడు జెబి.శౌరీ హామీ ఇచ్చారు. బుధ వారం భద్రాద్రి జిల్లా డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. 1984లో గొలు సు కనకమ్మ కుమారులు ఉమ్మడి విద్యానగర్ పంచాయతీలో ప్లాట్లు చేయించారని గుర్తు చేశారు. వాటిని 700 మంది కొ నుగోలు చేశారని తెలిపారు. 2012లో చుంచుపల్లి మండలా నికి చెందిన సీతారాములు తప్పుడు కాగితాలు సృష్టించి కొను గోలుదారును బెదిరించి, 1/70 ని అడ్డు పెట్టుకొని కోర్టులో తప్పుడు డాక్యూమెంట్ సృష్టించి సమర్పించి కోర్టును తప్పు దారి పట్టించాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీతారాములతో పాటుగా కొంతమంది అతని అనుచరులు ఈ సంఘటనలకు పాల్పడినట్లు స్పష్టం చేశారు. గతంలో బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసులు నమోదు చేసి రిమాండ్‌కు సైతం పంపించినట్లు గుర్తు చేశారు. పది సంవత్సరాల నుంచి ఉమ్మడి చుంచుపల్లి ప్రాంతం పరిధిలో వీరి ఆగడాలు ఎక్కు వయ్యాయన్నారు. భూ బాధితులకు అండగా కాంగ్రెస్ పార్టీ ఉంటుందన్నారు. కొత్తగూడెం కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

గుర్రాలచెరువులో 7న ఆషాడమాస బోనాలు

అశ్వారావుపేట రూరల్, జూలై 3: మండలంలోని గుర్రాలచెరువులో స్వయంభూ శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో ఈనెల 7న ఆషాడమాస బోనాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు బుధవారం తెలిపారు. ఆషాడమాసం మొత్తం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించటం జరుగు తుందన్నారు. ఈనెల7న పువ్వులతో, 12న కూరగాయలతో, 19న పండ్లతో, 26న పసుపుకొమ్ములతో, ఆగష్టు 2న గాజులతో అమ్మవారిని అలంకరించి పూజలు నిర్వహించటం జరుగుతుందన్నారు. ఆగష్టున 2వ తేదీన అశ్వారావుపేటలోని సాయిబాబా మందిరం నుంచి 108 రకాల సారెలతో అమ్మవారికి చీరే సారే సమర్పిస్తారని తెలిపారు. బోనాలు, పూజా కార్యక్రమాలకు భక్తులు అధికంగా తరలిరావాలని నిర్వాహకులు కోరారు.

రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సస్పెన్షన్

దమ్మపేట, జూలై 21: దమ్మపేట తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా విధుల నిర్వ హిస్తున్న జబ్బా ఎర్రయ్యపై కలెక్టర్ జితేష్ వి.పాటిల్ బుధవారం సస్పెన్షన్ వేటు వేశారు. నాగుపల్లి గ్రామానికి చెందిన బండి లక్ష్మీనారాయణరెడ్డి తనకుటుంబ సభ్యులకు నివాస ధృవీకరణ పత్రము కోసం 2022లో దరఖాస్తు చేసుకున్నారు. ధృవీకరణపత్రము జారీ చేసేందుకు రూ.10వేల రూ.లు లంచాన్నీ ఆర్ఐ ఎర్రయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు లక్ష్మీనారాయణరెడ్డి ఆర్ఐ ఎర్ర య్యకు రూ.10వేలు ఇవ్వటంతో తహసీల్దార్ కార్యాలయం నుంచి నివాస ధృవీకరణ పత్రం ఇచ్చారు. బాధితులు పూర్తి ఆధారాలతో కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై విచారణ జరిపిన కలెక్టర్ ఆరోపణలు రుజువుకావటంతో ఆర్ఐ ఎర్రయ్యను సస్పెండ్ చేశారు. దీనిపై తహసీల్దార్ నరేష్‌ను వివ రణ కోరగా సస్పెండ్ చేసినట్లు ధృవీకరించారు.

బంగారు ఆభరణాల దొంగ అరెస్టు: రిమాండ్‌కు తరలింపు

మణుగూరు, జూలై 3: మణుగూరు పట్టణంలోని హనుమాన్ టెంపుల్ క్రాస్ రోడ్ వద్ద బుధవారం సీఐ ఎస్ సతీష్‌కుమార్ వాహన తనిఖీలు చేస్తుండగా పోలీసులను చూసి ఓ వ్యక్తి పారిపోయేందుకు ప్రయత్నించాడు. అతన్ని పట్టుకుని విచారించగా మణుగూరు చేపల మార్కెట్ ఏరియా వాసి కుంజా మోహన్ కృష్ణగా గుర్తించారు. గత జూన్‌లో ఖమ్మం 2 టౌన్ పరిధిలో ఓ మోటార్ సైకిల్ దొంగిలించా నని, 24న మణుగూరులోని చాపల మార్కెట్ ఏరియాలో ఓ ఇంటి తాళాలు పగుల గొట్టి రెండున్నర తులాల బంగారు చైన్, రెండున్నర తులాల బ్రాస్‌లెట్ ఐదు తులాల వెండి పట్టీలను దొంగిలించానని ఆ వస్తువులను ముతూట్ ఫైనాన్స్‌లో పెట్టి నగదు తీసుకన్నుట్లు ఒప్పుకున్నాడు. ఇతను దొంగిలించి వస్తువుల విలువ మొత్తం రెండున్నర లక్షల రూపాయలు ఉంటుందని సీఐ తెలిపారు. మోటార్ సైకిల్ , బంగారు వెండి ఆభరణాలను స్వాధీన పరుచుకొని కోర్టుకు రిమాండ్‌కు తరలించామని తెలిపారు. ఈ కేసును చేధించడంలో పాల్గొన్న ఎస్ఐ మేడ ప్రసాద్, హెచ్‌సీ రవి,రామారావు, వీర, షమీం, బుచ్చిబా బులను మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి అభినందించారు.

తాగునీటి బోర్లకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు

ఇల్లెందురూరల్, జూలై 3: ఇల్లెందు మండలం సుభాష్‌నగర్ గ్రామపంచాయతీలో బుదవారం స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్య మూడు మంచినీటి బోర్లకు శంకుస్థాపనలు చేశారు. సింగరేణి నిధులతో చేపట్టిన బోర్లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కనకయ్య సూచించారు. ఈ కార్యక్ర మంలో వైస్‌ఎంపీపీ మండల రాము, మాజీ సర్పంచ్ వల్లాల మంగమ్మ, ఎంపీటీసీ ఉమ దేవీ, శీలం రమేష్, దనుంజయ్, అపర్ణ, బోడపాటి శ్రీనివాసరావు, పంచాయతీ కార్య దర్శి రజినికాంత్ పాల్గొన్నారు.



బోరు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోరం

సీతారామ జలాలను ఇతర ప్రాంతాలకు తరలించొద్దు

● సీపీఎం రాష్ట్ర నాయకుడు కాసాని

జూలూరుపాడు, జూలై 3: రీ డిజైన్ల పేరుతో సీతారామ జలాలను భద్రాద్రి జిల్లాకు అందించకుండా ఇతర ప్రాంతాలకు తరలించేందుకు జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు ప్రయత్నాలు చేస్తున్నారని సీపీఎం రాష్ట్ర నాయకుడు కాసాని అయిలయ్య ఆరోపించారు. బుధవారం జూలూరుపాడులోని పార్టీ కార్యలయంలో బాణోత్ ఇస్రా అధ్యక్షతన సీపీఎం మండల కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్ట్ ద్వారా జలాలను ఇతర ప్రాంతాలకు తరలిస్తే అడ్డుకుంటా మని అన్నారు. జిల్లా మంత్రులు తమ ప్రయత్నాలు విరమించుకుని పాత డిజైన్ ప్రకారమే పనులను చేపట్టి గోదావరి జలాలను సీతారామ ద్వారా భద్రాద్రి జిల్లాలోని రైతులకు అందించాలని లేకుంటే తమ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామని తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి యాసా నరేష్, నాయకులు బాణోత్ మధు, జి. వెంకటి, సుగుణ, పి. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పాఠశాలలకు ఉపాధ్యాయుల నియామకం



కరకగూడెం, జూలై 3: మండలంలోని పలు ప్రభుత్వ పాఠ శాలలో ఇటీవల ఉపాధ్యాయులను ప్రభుత్వం బదిలీలు చేసింది. బదిలీలలో భాగంగా కరకగూడెం మండలంలోని పలు పాఠశాలల నుంచి ఉపాధ్యాయులు బదిలీలపై వెళ్లారు. కానీ పలు పాఠశాలలో బాధ్యతలు చేపట్టలేదు. దాంతో పాఠశాలలో విద్యార్థులు ఇబ్బందులు పడుతుండ టంతో.. సర్కారు బడుల్లో సాగని చదువులు అనే కథనం ఆంధ్రజ్యోతి జూన్ 30న ప్రచురించడంతో స్పందించిన జిల్లా అధికారులు బుధవారం మండలం లోని భట్టుపల్లి, అనంతారం జిల్లా పరిషత్ పాఠశాలలకు ఉపాధ్యాయులను నియమిం చారు. 5న మండలంలోని అన్ని పాఠశాలలకు పూర్తి స్థాయి ఉపాధ్యాయులను నియ మించనున్నట్లు పాఠశాల హెచ్ఎంలు 'ఆంధ్రజ్యోతి'తో తెలిపారు.ఉపాధ్యాయులు రావ డంతో విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పేద దేశాలను దోపిడి చేస్తున్న పెట్టుబడి దేశాలు: మాస్‌లైన్

పాల్వంచ రూరల్, జూలై 3: అంతర్జాతీయస్థాయిలో పేద దేశాలను సామ్రాజ్యవాద పెట్టుబడి దేశాలు దోపిడి చేస్తున్నాయని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శివ ర్గసభ్యులు కేజీ. రాంచంద్రన్ ఆరోపించారు. బుధవారం మండలంలోని పెద్దమ్మతల్లి ఫంక్షన్ హాలులో సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా జిల్లా రాజకీయ శిక్షణ తరగ తులను మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య జెండా ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా జాతీయ, ఆర్థిక స్థితిగతులు అనే అంశంపై కేజీ. రాంచంద్రన్ మాట్లా డుతూ పేదదేశాల సంపదను దోచుకునేందుకు సామ్రాజ్యవాద దేశాలు వ్యూహాలు పన్నుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి కెచ్చల రంగయ్య, రాష్ట్ర నాయకులు గోపినేపల్లి వెంకటేశ్వరరావు, జిల్లా నాయకులు రాయల చంద్రశేఖర్, చంద్ర అరుణ, ముద్దా భిక్షం, జాటోత్ కృష్ణ, ఐఎఫ్ టీయూ నాయకులు మధుసూధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం

ఇల్లెందురూరల్, జూలై 3: ఇల్లెందు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సాదా సీదాగా కొనసాగింది. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చీమల నాగరత్నమ్మ అధ్యక్షతన బుధవారం జరిగిన ఈ సమావేశంలో పలు సమస్యలపై చర్చించారు. వర్ష కాలంలో గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీటిని అందించేవిధంగా చర్యలు చేపట్టాలని, లీకే జిలు లేకుండా తాగునీరు ప్రజలకు అందించాలని పలువురు ప్రజాప్రతినిధులు అధికా రులను కోరారు. మిషన్ భగీరథ మంచి నీళ్ల లీకేజీలు ఏర్పాడుతున్నాయని అధికా రుల పట్టించుకొవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈసమావేశంలో జడ్పీటీసీ వాంకుడోత్ ఉమదేవి, వైస్‌ఎంపీపీ రాము, ఎంపీడీవో దన్‌సింగ్, ఎంపీఓ చిరంజీవి, వివిద శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీడబ్ల్యుసీ ఎస్‌డీఈగా పృథ్వీ బాధ్యతల స్వీకరణ

భద్రాచలం, జూలై 3: భద్రాచలం కేంద్ర జల సంఘం ఎస్‌డీఈగా పృథ్వీ బాధ్య తలు స్వీకరించారు. ఇటీవల వరకు విజయవాడలో కృష్ణా బేసిన్ పరిధిలో పని చేసిన ఆయన బదిలీపై భద్రాచలం సీడబ్ల్యుసీకి రావడం జరిగింది. కాగా గత కొంత కాలగా భద్రాచలం సీడబ్ల్యుసీలో ఎస్‌డబ్ల్యుఈ పోస్టు ఖాళీగా ఉంది. ఈ క్రమంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. గోదావరి వరదల సీజన్ ఆరంభం కానున్న తరుణంలో అధికార యంత్రాంగం ఆయన్ను భద్రాచలం సీడబ్ల్యుసీ ఎస్‌డీఈగా నియమించినట్లు తెలు స్తోంది.

గోదావరికి కొత్తనీరురాక

భద్రాచలం, జూలై 3: నిన్నమొన్నటి వరకు ఇసుక తిన్నెలు రాళ్లగుట్టలతో సెల యేరులా తలపించిన భద్రాచలంలోని గోదావరికి కొత్తనీరు వచ్చి చేరింది. ఎగువ నుంచి నీరు వచ్చి చేరడంతో భద్రాచ లంలో నీటిమట్టం గతంలోకంటే స్వల్పం గా పెరిగింది. గత నెల వరకు 3.4 అడు గులున్న నీటిమట్టం 9.2 అడుగుల వరకు పెరిగింది. కాగా నీటిమట్టం స్వల్పంగా పెరిగినా ఒడ్డున ఉన్న చిరు దుకాణాలకు చెందిన వస్తువులు కొట్టుకుపోయాయి.

బైపాస్ రోడ్డు పనులు త్వరలో పునఃప్రారంభం

అధికారులతో కలిసి ప్రతిపాదిత ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యే కూనంనేని

కొత్తగూడెం, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఆగిపోయిన పాల్వంచ - కొత్తగూడెం బైపాస్ రోడ్డు పనులను ప్రారంభించి త్వరలోనే ప్రజలకు అందు బాటులోకి తెస్తామని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. పట్టణంలోని ప్యూన్‌బస్తీ, పాత కొత్తగూడెం శివారులోని ప్రతిపాదిత బైపాస్ రోడ్డు నిర్మాణ ప్రాంతాలను రోడ్లు, భవనాలు, నేషనల్ హైవే అథారిటి అధికారులతో కలిసి బుధవారం ఎమ్మెల్యే సంద ర్శించి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జంట పట్టణాల ట్రాఫిక్ సమస్యను గుర్తించి అప్పటి ప్రభుత్వంతో కొట్లాడి బైపాస్ రోడ్డును ప్రతిపాదించి నిధులు మంజూరు చేయించామని, పనులు పూర్తవుతున్న తరుణంలో ఆ తర్వాత అధికారం చేపట్టి పార్టీ, ప్రజాప్రతినిధి మోకాలడ్డ టంతో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయన్నారు. నిలిచిపోయిన పనులు మళ్లీ ప్రారం భించి వేగవంతంగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. బైపాస్ రోడ్డు పూర్తైతే ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. రోడ్లు, భవనాల శాఖ అధికారులు, నేష నల్ హైవే అథారిటి అధికారులు రోడ్డు నిర్మాణ విషయంలో ప్రత్యేక దృష్టి సారించి పనులు ప్రారంభించి పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట అధికారులతోపాటు సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా, నాయకులు వాసిరెడ్డి మురళీ, వట్టికొండ మల్లికార్జున్‌రావు, భూక్య శ్రీను, కూనంనేని భరత్, జలీల్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

గోటి తలంబ్రాల వరి విత్తనాలకు భద్రాద్రిలో పూజలు

● ఏపీలోని కోరుకొండ నుంచి తరలివచ్చిన భక్త బృందం

భద్రాచలం, జూలై 3: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఏటా నిర్వహించే శ్రీరామ నవమి ఉత్సవాలకు ఏపీలోని తూర్పుగో దావరి జిల్లా కోరు కొండకు చెందిన శ్రీకృష్ణ చైతన్య సంఘం భక్తబృందం కోటిగోటి తలంబ్రాలను తీసుకొస్తుం టారు. ఈ క్రమంలో బుధవారం భక్తబృందం కోరుకొండ నుంచి వరివిత్తనాలను భద్రాచలం తీసుకొచ్చి భద్రాద్రి రామయ్య సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 14వ సారి కోటిగోటి తలంబ్రాల మహాయజ్ఞంలో భాగంగా ఈ పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు శ్రీకృష్ణ చైత న్య సంఘం అధ్యక్షుడు కల్యాణం అప్పారావు తెలిపారు. గత 14 ఏళ్లుగా ఏటా వరి విత్తనా లను భద్రాద్రికి తీసుకొచ్చి స్వామివారి పాదాల చెంత ఉంచి పూజలు నిర్వహించి అనంతరం తూర్పుగోదావరి జిల్లాలోని గోకవరం మండలం అచ్చుతాపురం గ్రామంలో వరి విత్తనాలను చల్లి భక్తిశ్రద్ధలతో పంటను పండించి ఆ వరి ధాన్యాన్ని రెండు తెలుగు రాష్ట్రాల్లోని మహిళా భక్తులకు పంపిణీ చేస్తున్నారు. మహిళలంతా ఆ వరిధాన్యాన్ని భక్తిశ్రద్దలతో శ్రీరామనామ స్మరణ చేస్తూ గోటితో ఒలిచి తలంబ్రాలను తయారు చేసి భద్రాద్రి రామయ్యకు సమర్పిస్తారు. ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణ చైతన్య సంఘం అధ్యక్షుడు కల్యాణం అప్పారావు, భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, దేవస్థానం రామాయణపారాయణదారులు ఎస్జీజీ అంతర్వేది కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.



ఈవో చేతుల మీదుగా వరి విత్తనాలను స్వీకరిస్తున్న కోరుకొండ భక్తులు

మాదక ద్రవ్యాల నిర్మూలన ప్రతీ ఒక్కరి బాధ్యత

● కొత్తగూడెం త్రీటౌన్ సీఐ వరప్రసాద్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూలై 3: మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరు బాధ్యతతో వ్యవహరించాలని కొత్తగూడెం త్రీటౌన్ సీఐ వరప్రసాద్ సూచించారు. బుధవారం పట్టణంలోని రైతు బజార్, మానస పబ్లిక్ స్కూల్ పాఠ శాలలో విద్యార్థులకు, రైతులకు, వ్యాపారు లకు అవగాహన కల్పించారు. మాట్లా డుతూ యువత చెడు మార్గంలో వెళ్ళ కుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల న్నారు. అదేవిధంగా దురలవాటులకు లోను కాకుండా విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు నిత్యం పర్యవేక్షించాలని సూచించారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం నడుం బిగించి బాధ్యతతో మెలగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో త్రీటౌన్ సిబ్బంది, వ్యాపారులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.